


# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ




| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 244 | ది. 5-12-2025 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 244 | Date : 5-12-2025 | Friday | Pages : 8 | Rs.1/- |

## శంకుస్థాపన బాటలో సగానికి పైగా ఎంఓయూలు

- ప్రాసెస్ లోకి వచ్చిన రూ.7.69 కోట్ల పెట్టుబడులు
- 45 రోజుల్లోగా మెజార్టీ ఎంఓయూలు గ్రౌండింగ్ కావాలి
- డ్వాక్రా మహిళల ద్వారా పశువుల దాణా తయారీ పరిశ్రమలు
- క్వాంటం వ్యాలీకి సలహా మండలి నియమించండి
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వల్లే ఏపీకి పరిశ్రమలు వస్తున్నాయి
- 13వ ఎస్ఐపీబీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- రూ. 20,444 కోట్ల పెట్టుబడులకు... 56,278 ఉద్యోగాలకు ఎస్ఐపీబీ ఆమోదం



**అమరావతి,డిసెంబర్ 4 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సీఐఐ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాల్లో 50 శాతానికి పైగా ఆమోద ప్రక్రియలోకి వచ్చాయని, 45 రోజుల్లోగా వీటికి శంకుస్థాపన జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన గురువారం సచివాలయంలో 13వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల బోర్డు సమావేశం జరిగింది. ఇందులో రూ.20,444 కోట్ల విలువైన పెట్టుబడులకు 13వ ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. దీంతో 56,278 మందికి ఉద్యోగావకాశాలు వస్తాయి. ఇటీవల విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో ఒప్పందాలు కుదుర్చుకున్న 6 కంపెనీలకు కూడా ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. అలాగే విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలపై సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... 'ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని చూసే ప్రముఖ సంస్థలు పెద్దఎత్తున ఏపీకి వస్తున్నాయి. కంపెనీలు స్థాపించడానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ఆయా కంపెనీలకు అవసరమైన నీరు, విద్యుత్, భూమి వంటి సౌకర్యాలను కల్పిస్తున్నాం. వాటి విషయంలో పారదర్శకత పాటిస్తుండడం వల్లనే ప్రాజెక్టులు ఏపీకి వస్తున్నాయి. గత పాలకులు సింగపూర్ లాంటి దేశాన్నే ఇబ్బందులు పెట్టారు. ఆ దేశ కంపెనీలను ఇబ్బంది పెట్టారు. అలాంటి పరిస్థితులుంటే రాష్ట్రానికి పెట్టుబడులు రావు. అంతర్జాతీయ స్థాయిలో చెడ్డ పేరు వస్తుంది. మనం ఆ బ్యాడ్ ఇమేజ్ ని చెరిపేసి... ఏపీకి బ్రాండ్ ఇమేజ్ తీసుకువచ్చాం. అందుకే ఇటీవల మనం నిర్వహించిన పెట్టుబడుల సదస్సుకు మంచి స్పందన వచ్చింది.' అని సీఎం అభిప్రాయపడ్డారు.

**20 రోజుల్లోనే ఆచరణ దిశగా...** "20 రోజుల క్రితం విశాఖ భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తే... ఇప్పటికే రూ.7.69 కోట్ల విలువైన ఒప్పందాలు ఆచరణ దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ ఎంఓయూలు అన్నింటికీ ఏయే జిల్లాల్లో ఏర్పాటు చేయాలి... ఎక్కడెక్కడ భూములివ్వాలనే అంశంపైనా నిర్ణయాలు జరిగాయి. ఇక మిగిలిన ఎంఓయూలను వీలైనంత త్వరగా పట్టాలెక్కించాలి. 45 రోజుల్లోగా ఎంఓయూలు అన్నింటినీ గ్రౌండింగ్ అయ్యేలా చూడాలి. వీలైనన్ని ఎంఓయూలను గ్రౌండింగ్ చేసి... దావోస్ సదస్సుకు వెళ్తే మరిన్ని పెట్టుబడులను వస్తాయి. త్వరితగతిన ప్రాజెక్టులు కార్యరూపం దాల్చాలి. దావోస్ పర్యటనకు ముందే 75 ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన జరిగేలా చూడాలి. ఎంఓయూల గ్రౌండింగ్‌పై ప్రతీ వారం సీఎస్ సమీక్షించాలి. ఇక నుంచి ఎస్ఐపీబీతో పాటు ఎంఓయూలపైనా స్వయంగా సమీక్షిస్తాను. జిల్లా కలెక్టర్లు కూడా వీటిపై దృష్టి పెట్టాలి. ఇక పరిశ్రమలు గ్రౌండింగ్ అయ్యే విధానానికి సంబంధించి ఓ విధానాన్ని రూపొందించండి. ఆ విధానాన్ని కెబినెట్లో ఆమోదిద్దాం. ముఖ్యమంత్రి, మంత్రి వర్గ ఉప సంఘం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా ఆయా శాఖలకు చెందిన మంత్రులు, ఉన్నతాధికారులతో మోనిటరింగ్ రివ్యూ మెకానిజం ఏర్పాటు చేసుకుందాం. ఇక భూసేకరణలో ఎక్కడా వివాదాలు రాకుండా చూడాలి. భూములకు సంబంధించి ఒక్క ఫిర్యాదు రాకూడదు. భూములు తీసుకున్న వాళ్లు ఎంతో సంతోషంగా ఉంటారో... ఇచ్చిన వాళ్లు కూడా అంతే సంతోషంగా ఉండాలి."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ప్రభుత్వ యంత్రాంగం కూడా నైపుణ్యాలు పెంచుకోవాలి..** "ఆమోదం పొందిన యూనిట్లు, పరిశ్రమలు నిర్దేశిత గడువులోగా ఏర్పాటు చేయాల్సిందే. దీనిపై అధికారులు ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలి. వివిధ రంగాల్లో ఏపీని అభివృద్ధి చేయాలని చూస్తున్నాం. అలాగే రాష్ట్రాన్ని నాలెడ్జ్ ఎకానమీగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈక్రమంలో ప్రభుత్వ యంత్రాంగం కూడా పూర్తిగా టెక్నాలజీపై గ్రిప్ పెంచుకోవాలి. లేకుంటే మనం వెనుకబడిపోతాం. ఇదే కాకుండా... భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రాష్ట్రంలోని యువతను సిద్ధం చేయాలి. ఈ మేరకు వివిధ రంగాల్లో వారిని నైపుణ్యాలు అందించేలా చూడాలి. లాజిస్టిక్స్ యూనివర్సిటీ, సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ, గ్రీన్ ఎనర్జీ యూనివర్సిటీ వంటివి ఏర్పాటు చేయాలి. క్వాంటం వ్యాలీకి అడ్వైజరీ బాడీని నియమించండి. మెంటరింగ్, మోనిటరింగ్, వెంచర్ క్యాపిటల్ కోసం ఇది పనిచేయాలి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అనేది స్టార్టప్‌లకు ఓ మెంటార్ గా వ్యవహరిస్తుంది. క్వాంటం వ్యాలీలో నిర్మించే 6 క్వాంటం టవర్లలో రెండు టవర్లను క్వాంటం అల్గారిథం డెవలప్మెంట్ కోసం... మరో రెండు టవర్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డెవలప్మెంట్ కోసం కేటాయించండి. ఏఐ బేసిక్స్‌ను 7 తరగతి నుంచే బోధించేలా చర్యలు చేపట్టండి. మైక్రోసాఫ్ట్, గుగూల్ లాంటి కంపెనీల సాయంతో బృందాన్ని ఏర్పాటు చేయండి. పర్యాటక కేంద్రాలకు ప్రచారం కల్పించండి. జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలు ఆతిధ్య రంగంలోనూ, పర్యాటక రంగంలోనూ రావాలి. విశాఖ కాపులుప్పాడలో హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్ల కోసం 50 ఎకరాలు కేటాయించండి.

## కూటమి నాయకుల ఐక్యతే రాష్ట్రాభివృద్ధికి మూలం

- 15 ఏళ్లు ఇదే స్ఫూర్తి కొనసాగితే అభివృద్ధి సుస్థిరమవుతుంది
- వైసీపీ పాలనలో దిగజారిన వ్యవస్థలను తిరిగి నిలబెడుతున్నాం
- క్షేత్రస్థాయిలో ప్రజల గొంతుకగా మారుదాం
- చిన్న చిన్న కమ్యూనికేషన్ గ్యాప్స్ ఉంటే కలిసి మాట్లాడుకుందాం
- చిత్తూరులో కూటమి పార్టీల నాయకులతో ప్రత్యేకంగా సమావేశమైన ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్



**విజయవాడ,డిసెంబర్ 4 (వార్తాప్రభ) :** "వర్షించని మేఘం... శ్రమించని మేధావి" ఉన్నా, లేకపోయినా ఒక్కటే. అలాగే కూటమి ప్రభుత్వానికి ఇంత బలం ఉండి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవస్థల్లో మార్పులు తీసుకురాకపోతే మనకు ఎన్ని పదవులు ఉన్నా నిష్ప్రయోజనమే అని ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో సమూల మార్పులు తీసుకురావాలనే రాష్ట్రవ్యాప్తంగా 77 డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసులు ప్రారంభించామని, ఏళ్ల తరబడి ప్రమోషన్లకు నోచుకోని 10 వేల మంది పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించగలిగామని అన్నారు. ఒక ప్రభుత్వ ఉద్యోగి కొడుకుగా పదోన్నతి ఎంత కీలకమో తెలుసు కాబట్టే... ఎటువంటి పైరవీలకు తావు లేకుండా అర్హతే ఆధారంగా ఉద్యోగులకు పదోన్నతలు కల్పించామన్నారు. గురువారం చిత్తూరు రెడ్డిగుంట వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసును ప్రారంభించిన అనంతరం జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ఈ రోజు కూటమి ప్రభుత్వం వ్యవస్థల ప్రక్షాళనపై ఇంత బలంగా ముందుకు వెళ్తుందంటే దానికి కారణం మీ అందరి మద్దతు. మీరు ప్రభుత్వానికి అండగా నిలబడడంతోనే ఇదంతా సాధ్యమైంది.

**మన ఐక్యతే రాష్ట్రానికి బలం..**
కూటమిలో ఉన్న మూడు పార్టీల నాయకులకు విభిన్న భావజాలాలు ఉన్నా... మనందరం "రాష్ట్రం బాగుండాలి- అరాచకాలు ఉండకూడదు " అనే సదుద్దేశంతో ఒక గొడుగు కిందకు వచ్చి కూటమిగా ఏర్పడ్డాం. మనలో మనకు చిన్న చిన్న కమ్యూనికేషన్ గ్యాప్స్, మనస్పర్థలు ఉండటం సహజం. ఒక చోట కూర్చొని మాట్లాడుకుంటే అన్ని సమస్యలు తీరతాయి. ఆ రోజు చిన్నగా మొదలుపెట్టిన కూటమి ఈ రోజు కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వానికి ఎంతో బలమైన శక్తిగా మారింది. ఈ రోజు ఇంతమందికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వగలిగామంటే కారణం మనందరి ఐక్యతే. ఇదే ఐక్యతతో మరో 15 ఏళ్లు కష్టపడితే రాష్ట్రానికి సుస్థిర అభివృద్ధి సాధ్యం అవుతుంది.

**కష్టపడితేనే... ప్రతిఫలం..** నేను 2008 నుంచి రాజకీయాల్లో ఉన్నాను. ఏనాడు కూడా గుర్తింపు కోరుకోలేదు. సమాజంలో నిస్సహాయులైన వ్యక్తులకు అండగా నిలబడడమే నాయకుడి లక్షణం. నిస్వార్థంగా మన పని మనం చేసుకుపోతే గుర్తింపు, పదవి వాటికవే వస్తాయి. అంతే తప్ప పదవే పరామావధిగా భావించి పని చేస్తే అందలం ఎక్కడం కష్టం. ఏ వ్యక్తికి అయినా పదవి అనేది బాధ్యత తప్ప అలంకారంగా మారకూడదు.

## క్వాంటం ఎకానమీ లీడర్ గా హైదరాబాద్

- తెలంగాణ విజన్ డాక్యుమెంట్ కు అనుగుణంగా క్వాంటం రోడ్డు మ్యాప్ ఉంది
- క్వాంటం రోడ్డు మ్యాప్ కలిగిన తొలి రాష్ట్రం తెలంగాణ
- రాష్ట్ర, దేశ అభివృద్ధికి క్వాంటం టెక్నాలజీ కీలకం
- క్వాంటం స్టార్ట్ అప్ పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




**హైదరాబాద్,డిసెంబర్ 4 (వార్తాప్రభ) :** భవిష్యత్తు క్వాంటం ఎకానమీ లీడర్ గా హైదరాబాద్ నిలుస్తుంది, ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, డిజిటల్ నైపుణ్యం వంటి అన్ని వనరులు హైదరాబాదులో దండిగా ఉన్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. నీతి ఆయో రోడ్డు మ్యాప్ "తెలంగాణ రైజింగ్ 2047", 2047 నాటికి తెలంగాణను %వి%3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చే రాష్ట్ర దృష్టికోణానికి అనుగుణంగా రూపొందించబడింది అని అభివర్ణించారు.తెలంగాణ క్వాంటం వ్యూహం ద్వారా క్వాంటం టెక్నాలజీకి ప్రత్యేక రోడ్‌మ్యాప్ కలిగిన దేశంలోని తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందనీ డిప్యూటీ సీఎం తెలిపారు. 1980వ దశకం లోనే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గురించి మాట్లాడుకున్నామని రాబోయే రోజుల్లో ప్రపంచాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నడిపిస్తుందని ఆ రోజుల్లోనే తాము హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులుగా చర్చించుకున్న విషయాన్ని సభలో డిప్యూటీ సీఎం పంచుకున్నారు. క్వాంటం టెక్నాలజీ ప్రపంచాన్ని ఏ ఇతర సాంకేతికత కంటే వేగంగా అన్ని రంగాల్లోనూ మార్పు తీసుకురాబోతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. గొప్ప భవిష్యత్తు కోరుకునే ఏ దేశానికైనా క్వాంటం వ్యూహం అవసరం అని అన్నారు. దేశాల భవిష్యత్తు, వారి జాతీయ భద్రత, వారి ఆర్థిక పరిమాణం, అభివృద్ధి , అన్నింటినీ ఇది పెద్ద స్థాయిలో ప్రభావితం చేస్తుందనీ తెలిపారు.జాతీయ మిషన్‌కు అనుసంధానంగా రూపొందించిన తెలంగాణ క్వాంటం వ్యూహం, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, విద్య, మౌలిక వసతులు, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో ఏకీకృత, భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకున్న లక్ష్యాలను సాధిస్తుంది అని డిప్యూటీ సీఎం తెలిపారు. టి క్యూ ఎస్ ప్రారంభంతో పాటు, భారతదేశంలో అత్యంత ఆధునిక క్వాంటం ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను నిర్మించాలన్న మా రాష్ట్ర సంకల్పాన్ని ప్రపంచానికి ఈ వేదిక ద్వారా ప్రకటిస్తున్నాం అన్నారు. మేము కేవలం వ్యూహరచననే కాకుండా, అమలుకు రోడ్డు మ్యాప్ ను ఆవిష్కరిస్తున్నాం అని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క తెలిపారు. బలమైన, లోతైన పరిశ్రమ, విద్యాసంస్థల భాగస్వామ్యాలను మేము ప్రోత్సహించబోతున్నాం అన్నారు. క్వాంటం టెక్నాలజీ తెలంగాణతో పాటు భారత ఆర్థిక వృద్ధికి కీలకాధారం కానుంది అని డిప్యూటీ సీఎం వివరించారు. ఇది అన్ని రంగాల్లో గ్లోబల్ పెట్టుబడులను ఆకర్షించడానికి, నిలుపుకోవడానికి సహాయపడుతుంది, మా పరిశోధన, ఆవిష్కరణ ప్రణాళికలకు ఇది అత్యంత కీలకం అని తెలిపారు. స్టార్టప్‌ల లక్ష్యాలను చేరుకోవడంలో కూడా క్వాంటం ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ఈ రోజు, మేము యువ భారత్ స్టార్టప్ ఫండ్‌ను ?1,000 కోట్లతో స్థాపిస్తున్నామని ప్రత్యేకంగా చెప్పాలి,క్వాంటం స్టార్టప్‌లు మా ప్రధాన దృష్టి అని డిప్యూటీ సీఎం ఉద్ఘాటించారు.

## ఏ.పీ.లో పెరగనున్న నియోజకవర్గాలు..

### -గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం



**అమరావతి,డిసెంబర్ 4 (వార్తాప్రభ) :** ఏపీలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలు పెరగనున్నాయి. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఏపీ విభజన సమయంలోనే తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల సంఖ్య పెరుగుతుందని చెప్పుకొచ్చారు. అయితే విభజన జరిగి పదేళ్లు దాటుతున్న ఇంతవరకు నియోజకవర్గాల సంఖ్య పెరగలేదు. దీనికి కారణం జనగణన, కుల గణన జరగకపోవడమే. అయితే వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి జనగణన ప్రారంభం కానుంది. 2027 ఫిబ్రవరి వరకు కొనసాగనుంది. అటు తరువాత కుల గణన మొదలుకానుంది. రిజర్వేషన్ల అంశము ఒక కొలిక్కి రానుంది. అప్పుడే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తవుతుంది. 2029 నాటికి నియోజకవర్గాల పునర్విభజన పూర్తి చేసి ఎన్నికలకు వెళ్లాలన్నది కేంద్ర ప్రభుత్వ ప్రణాళికగా తెలుస్తోంది.

**50 అసెంబ్లీ సీట్ల దాకా..** ఏపీలో దాదాపు 50 అసెంబ్లీ నియోజకవర్గాలు పునర్విభజనలో పెరగనున్నాయి. ప్రతి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో రెండు అసెంబ్లీ సీట్లు పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. తద్వారా ఇప్పుడు ఉన్న 175 అసెంబ్లీ సీట్లకు గాను.. అదనంగా మరో 50 సీట్లు పెరుగుతాయి. 225 అసెంబ్లీ స్థానాలతో ఏపీ శాసనసభ కొలువుదీరనుంది. 294 అసెంబ్లీ స్థానాలతో పటిష్టమైన స్థితిలో ఉండేది ఉమ్మడి ఏపీ. 42 పార్లమెంట్ స్థానాలు ఉండేవి. తెలంగాణ విభజనతో ఆ రాష్ట్రానికి 117 అసెంబ్లీ సీట్లతో పాటు 17 పార్లమెంట్ స్థానాలు దక్కాయి. ఏపీకి మాత్రం 175 అసెంబ్లీ సీట్లతో పాటు 25 పార్లమెంట్ స్థానాలు మిగిలాయి. పునర్విభజనతో ఏపీతోపాటు తెలంగాణలో సైతం సీట్లు పెరుగుతాయి.

**చివరిగా 2009లో..** చివరిసారిగా 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. అప్పుడు కేంద్రంలో యూపీఏ అధికారంలో ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టింది. ఆ సమయంలో పునర్విభజన జరగడంతో అధికార కాంగ్రెస్ పార్టీకి లాభించింది. అప్పట్లో టిడిపికి బలమైన నియోజకవర్గాలను అడ్డగోలుగా చీల్చారు. రిజర్వేషన్లను సైతం మార్చేశారు. అయితే పునర్విభజన ఎప్పుడు జరిగినా అధికార పార్టీకి ప్రయోజనమే. పైగా ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామి. ఆపై బిజెపి సైతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉంది. పైగా మూడు పార్టీలు 2029 ఎన్నికల్లో కలిసి వెళ్లేందుకు నిర్ణయం తీసుకున్నాయి. దీంతో సహజంగానే సీట్ల సంఖ్య పెరిగితే కూటమిలో అభ్యర్థులకు సర్దుబాటు చేయడానికి వీలుంటుంది. అయితే అధికార పార్టీలో సర్దుబాటు కాని వారు అసంతృప్తితో ఉంటారని.. వారంతా తమ వైపు వస్తారని అంచనా వేస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ.

## శరవేగంగా రాజధాని అమరావతి నిర్మాణ పనులు - మంత్రి నారాయణ



**అమరావతి,డిసెంబర్ 4 (వార్తాప్రభ) :** గవర్నర్ బంగళా లోక్ భవన్, ఇతర సముదాయాల నిర్మాణానికి రూ. 169 కోట్లు కేటాయించడం జరిగిందని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ శాఖామాత్యులు పొంగూరు నారాయణ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సీఆర్డీఏ 55వ అథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి నారాయణ ఏపీ సచివాలయంలోని ప్రచారవిభాగంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ లోక్ భవన్, ఇతర భవన సముదాయాలతో పాటు జ్యూడిషియల్ అకాడమి నిర్మాణాలకు అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ రూ. 163 కోట్లు అనుమతి లభించిందని, ఎస్టిమేషన్లు వేసి త్వరలో టెండర్లు పిలవనున్నామని వివరించారు. 2024-2025 వార్షిక నివేదిక సమర్పణకు కూడా అనుమతి లభించిందన్నారు. ఇక అమరావతి నగర నిర్మాణానికి నాబార్డ్ ద్వారా రూ. 7380.70 కోట్లు రుణం పొందడానికి అనుమతి పొందటం జరిగిందన్నారు. రూ. 532 కోట్లతో సీడ్ యాక్సిస్ రోడ్ ను నేషనల్ హైవే 16కి కలపడానికి టెండర్ ప్యాకేజికి అప్రూవల్ ఫర్ అవార్డ్ ను అథారిటీ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అమరావతి ప్రాంతంలో ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ, ఇన్నర్ రింగ్ రోడ్, రైల్వే ట్రాక్ తదితరాల నిర్మాణాలకు ల్యాండ్ పూలింగ్ ద్వారా 16,666 ఎకరాలు సేకరించనున్నామన్నారు. అమరావతి రాజధాని ప్రాంత రైతులతో ముఖాముఖి మాట్లాడటం జరిగిందని, రైతులందరూ తమ భూములను ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేయడం అభినందనీయమన్నారు. రైతులతో మరిన్ని సమావేశాలు నిర్వహించి వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతామన్నారు. గతంలో రైతులకు అందించిన ప్యాకేజీ వలే, ఇప్పుడు కూడా రైతులకు 10 సంవత్సరాలు ప్యాకేజీ అందిస్తామని హామి ఇచ్చారు. సీడ్ యాక్సిస్ రోడ్ మొదట మంగళగిరి రోడ్ కు జనవరి నెలాఖరు లోపు అనుసంధానం చేయనున్నామని, అటుపై నేషనల్ హైవే 16కు అనుసంధానం చేయనున్నామని వివరించారు. అనంతరం కరకట్ట రోడ్ ను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. సీడ్ యాక్సిస్ రోడ్ నిర్మాణంలో అవసరమైన చోట స్టీల్ బ్రిడ్జిల నిర్మాణం, ఫ్లైఓవర్ లు నిర్మాణాలు చేపట్టనున్నామని వివరించారు. అమరావతి రాజధాని ప్రాంతంలో ఇప్పటికే 15 అంగన్ వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలు నిర్మాణం పూర్తి అయ్యాయని, ఈ డిసెంబర్ నెలాఖరులోపు ప్రారంభానికి సిద్ధం అవుతాయని మంత్రి నారాయణ వివరించారు. ఇక మార్చి నెలాఖరు లోపు అధికారుల భవన సముదాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. అమరావతి రాజధాని ప్రాంతంలో 1500 కిలోమీటర్ల ఎల్పీఎస్ రోడ్లు ఇప్పటికే అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.

## వృత్తికి న్యాయం చేస్తున్నామా? ఆత్మ పరిశీలన చేసుకోండి..

- పీ హెచ్ సీ వైద్యులకు మంత్రి
- సత్యకుమార్ యాదవ్ హితవు
- క్యాన్సర్-04 స్క్రీనింగ్ పై ప్రజల్లో అవగాహన కల్పించాలని విజ్ఞప్తి



**విజయవాడ, డిసెంబర్ 4 (వార్తాప్రభ) :** 'హక్కుల సాధన కోసం ప్రయత్నాలు చేయడంలో తప్పులేదు. పేదలకు వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందిస్తున్నామా? లేదా? అన్న దానిపై నిత్యం ఆత్మ పరిశీలన చేసుకుంటూ ఉండాలి. పవిత్రమైన వైద్య వృత్తికి న్యాయం చేయాలి' అని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హితవు పలికారు. విజయవాడలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం గురువారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ను ఆరోగ్యాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు వైద్యులందరూ కృషి చేయాలని కోరారు. గ్రామీణులకు చేరువలో ఉండే వైద్యులు నిర్దేశించిన వేళల్లో కూడా పీహెచ్సీల్లో లేకుంటే ఎలా అని ప్రశ్నించారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ సాయంత్రంపూట వెళ్లి తనిఖీచేస్తే పీహెచ్సీకి తాళం వేసి ఉండడమేటని ప్రశ్నించారు. 24 గంటలపాటు పనిచేయాల్సిన పీహెచ్సీల్లో ఒకరూ కూడా లేకపోవడమేమిటన్నారు వైద్యుల నిర్లక్ష్యంవల్ల ప్రాణపోయిందన్న అపవాదు రాకూడదని ఇటీవల జరిగిన ఓ సంఘటనను గుర్తుచేశారు. వైద్యులు మంచిచేస్తే వెంటనే గుర్తింపు రాదన్నారు. కానీ.. చిన్న తప్పుచేస్తే

- 8లో

## మత్స్యకారుల అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం.. కాగిత



**కృత్తివెన్ను,డిసెంబర్ 4 (వార్తాప్రభ) :** బంటుమిల్లి మత్స్య సహాయ సంచాలకుల కార్యాలయం నందు గురువారం మత్స్యకారులకు నూత నంగా 78 బోటు లైసెన్స్ సర్టిఫికెట్స్ బోటు యజమానులకు అందజే సిన పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మత్స్య కారులను నిర్లక్ష్యం చేసిందని కూటమి ప్రభుత్వం లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో మత్స్యకారుల జీవన భృతి కింద ఏటా 20వేల రూపాయలను అందజేయడం జరిగింది అని. గత ప్రభుత్వం మత్స్యకారులకు ఆయిల్ రాయితీని నిలిపివేసిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులకు ఆయిల్ రాయితీ బిల్లులను చెల్లించడం జరిగింది అని తెలియజేసారు.. ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు మత్స్యకారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దేవుడు వరమిచ్చిన ఫలితం అందరిని ద్రాక్షేనా?





**విస్సన్నపేట,డిసెంబర్ 4 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం గుండె పోటు వచ్చిన సమయంలో అమృత సంజీవని వంటి ఇంజక్షన్లను మండల వైద్యశాలందు అందుబాటులో ఉంచిన అక్కరకు రాకపో వడం దేవుడు వరమిచ్చిన ఫలితం అందని ద్రాక్షే అన్నచందంగా ఉన్నదని సర్వత్రా వినిపిస్తుంది. విస్సన్నపేట మండల కేంద్రంలో 40 వేల రూపాయలకు పైగా విలువ చేసే హార్ట్ పెయిన్ ఇంజక్షన్ లు రెండు,మూడు ఉన్న పేషెంట్ కు వైద్య సహాయం అందించే పరిస్థితి లేక మహాసముద్రంలో మంచినీటి కోసం పరితపించే వారి వలె ఉన్నదని చెప్పవచ్చు. ఆసుపత్రి నందు గుండె సంబంధిత డాక్టర్ లేకపోవడం గుండెపోటుకు గురైన వాళ్ళు ఉన్న ఇంజక్షన్లను యాప్ ద్వారా వినియోగించుకునేందుకు సంపూర్ణ అవగాహన లేకపోవడం తదితర కారణాలు ప్రాణాలను నిలపటానికి ప్రతిబంధకాలుగా నిలుస్తున్నాయి. ప్రభుత్వ ఆలోచనలు ప్రతి ఒకరిని కాపాడేందుకు నిబంధనలు సరళం చేయాలని సర్వత్రా కోరుతున్నారు. గుండె నొప్పికి ఏ రకమైన ఇంజక్షన్ అవసరం తెలుసుకోవడానికి వెంటనే వైద్యుని సంప్రదించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. స్వీయ వైద్యం ప్రమాదకరం కావచ్చు. గుండెపోటు వంటి తీవ్రమైన పరిస్థితిలో నొప్పిని నియంత్రించడానికి తక్షణ వైద్యం అవసరం అవుతుంది. ప్రభుత్వ వైద్యశాలలో వేలాది రూపాయలు విలువచేసే ఇంజక్షన్ ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా గుండె నొప్పికి ఏ కారణం వలన వచ్చింది ఏ చికిత్స చేయాలి ఏ ఇంజక్షన్ ఉపయోగించాలి నిపుణులైన వైద్యులు మాత్రమే నిర్ధారించగలరు అన్న విషయం అందరికి తెలిసిందే. అలాంటి సమయంలో రక్తం గడ్డ కట్టకుండా ఉండే 44 వేల రూపాయలు విలువ గల ఇంజక్షన్ ప్రభుత్వం అందిస్తూ ఉన్న మహాభారత యుద్ధంలో యుద్ధం చేసే సమయంలో దానకర్ణుడు ఇబ్బంది పడినట్లు ఇంజక్షన్ అందుబాటులో ఉన్న వైద్యం చేసే గుండె వైద్య నిపుణుడు అందుబాటు లేకపోవడం గుండెపోటు వచ్చిన వ్యక్తికి భరోసా ఇవ్వటం పూర్తి శాతం కష్టమైనని ఫండమెంటల్ తెలిసిన వ్యక్తులను విడతల వారీగా ఆసుపత్రిలో అందుబాటులో ఉంచితే ప్రజల ప్రాణాలను కాపాడవచ్చు అని సర్వత్రా విజ్ఞప్తి చేస్తున్నారు. గత కంటి సంబంధిత డాక్టర్ విస్సన్నపేట ప్రధాన ఆసుపత్రి నందు అందుబాటులో ఉండేవారు ప్రస్తుతం కంటి సంబంధిత వైద్య సేవలు అందకపోవడంతో ప్రజలను గురవుతున్నారు. కంటి డాక్టర్ ను ఏర్పాటు చేయాలని ప్రజల కోరుతున్నారు.

## వైభవంగా శివాలయంలో ఇరుముడుల మహోత్సవం

● అయ్యప్ప మాలాధారుల మధ్య భక్తి శ్రద్ధలతో పాల్గొన్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు



**నందిగామ,డిసెంబర్ 4 (వార్తాప్రభ) :** శబరిమలై అయ్యప్ప స్వామి సన్నిధానానికి బయలుదేరే అయ్యప్ప భక్తుల కోసం స్థానిక సుఖ శ్యామలాంబ సమేత శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో నిర్వహించిన ఇరుముడుల మహోత్సవం గురువారం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఆలయంలో శరణుఘోష నడుమ జరిగిన ఈ మహోత్సవంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు స్థానిక నేతలతో కలిసి పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం మొత్తం "శరణం అయ్యప్ప" నినాదాలతో మారుమోగగా, భక్తుల ఉత్సాహం అందరినీ ఆకట్టుకుంది. సింగ్ బ్రదర్స్, మణికంఠ స్వామితో పాటు పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తుల ఇరుముడి మహోత్సవానికి వారు హాజరయ్యారు. గురుస్వాములు సాంప్రదాయబద్ధంగా మాలాధారులకు ఇరుముడులు కట్టి, శబరిమల సందర్శనకు పూనుకునే అయ్యప్పలకు శాస్త్రోక్తంగా దీవెనలు అందించారు.నందిగామ ప్రాంతంలో ప్రతి సంవత్సరం జరిగే ఈ కార్యక్రమం భక్తి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది.

## ప్రత్యామ్నాయ పంపు బిగిస్తున్న గ్రామ సర్పంచ్ - భూబత్తుల బాలకొండయ్య



**విస్సన్నపేట,డిసెంబర్ 4 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని చంద్రుపట్ల గ్రామపంచాయతీ పరిధిలో సంపద సృష్టి కర్మాగారం వద్ద నీటి సరఫరాకు గతంలో బోరు వేయడం జరిగిందని విద్యుత్తు లైన్ కొరకు డిపాజిట్ చేసేందుకు గ్రామపంచాయతీ ఖాతా నందు నిధులు లేకపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని చంద్రుపట్ల గ్రామ సర్పంచ్ భూబత్తుల బాలకొండయ్య తెలియజేశారు. గ్రామపంచాయతీ ఖాతాలో నిధులు జమ అయిన తర్వాత విద్యుత్తు లైన్ కు దరఖాస్తు చేస్తామని చెప్పారు. అప్పటివరకు కొట్టుడు బోరు పంపు ద్వారా నీటి వినియోగం చేయడం జరుగుతుందన్నారు.

## మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరునికి రూ కోటికి పైగా విలువైన వెండి మండపం సమర్పణ

● స్వామివారి సేవలో ఆర్వీఆర్ గ్రూప్ అధినేత రావి ●వీర రాఘవ చౌదరి కుటుంబం.





**మోపిదేవి/అవనిగడ్డ,డిసెంబర్ 4 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా, మోపిదేవిలో వేంచేసియున్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి హైదరాబాద్ కు చెందిన ఆర్ వి ఆర్ గ్రూప్ అధినేత, ఆర్వీఆర్ డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ చైర్మన్ రావి వీర రాఘవ చౌదరి , సౌభాగ్య లక్ష్మి దంపతులు ఒక కోటి ఒక లక్ష యాభై మూడు వేల ఏడు వందల నలభై రెండు రూపాయల విలువ గల 48 కేజీల 895 గ్రాములు బరువుగల వెండి మండపాన్ని సమర్పించారు. గురువారం ఉదయం రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ , ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు , స్వచ్ఛ ఆంధ్ర మిషన్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి , మండలి వెంకట్రామ్,కనపర్తి శ్రీనివాసరావు తదితరుల సమక్షంలో ఆలయ ఆవరణలో నూతన వెండి మండపాన్ని లాంఛనంగా ఆలయ డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామవరప్రసాద రావుకి అందించారు .వెండి మండపం తయారీకి తయారీదారులు అందించిన రశీదు, నాణ్యత ప్రమాణాలకు సంభందించిన పత్రాలను మంత్రి కొల్లు రవీంద్ర చేతులమీదుగా ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు కు అందించారు. అర్చకులు వెండి మండపాన్ని శ్రీ స్వామివారికి అలంకరించి, ఆర్వీఆర్ చౌదరి కుటుంబ సభ్యులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు ఆహూతుల చేతులు మీదుగా స్వామి వారి చిత్రపటాన్ని ఆర్వీఆర్ చౌదరికి బహూకరించారు.

## డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

● రాజీ మార్గమే రాజ మార్గం, సమయం, ధనం ఆదా చేసుకోండి ● జిల్లా న్యాయమూర్తి పి. శ్రీనివాసరావు



**నందిగామ,డిసెంబర్ 4 (వార్తాప్రభ) :** ఈ నెల 13తేదీ శనివారం జరగబోయే జాతీయ మెగా లోక్ అదాలత్ లను ఇరు వర్గాల కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని నందిగామ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ మరియు 16వ అదనపు జిల్లా జడ్జి పి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక కోర్టు ప్రాంగణంలో జరిగిన విలేకరుల సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ సమయం, ధనం ఆదా చేసుకునే రాజీ మార్గమే రాజ మార్గమని అనే నినాదంతో న్యాయ వ్యవస్థలో పేరుకుపోయిన కేసులు సత్వర పరిష్కారం కొరకు సుప్రీంకోర్టు, హైకోర్టు వారి ఉత్తర్వులు మే-రకు ఈ కార్యక్రమాన్ని మా 4 కోర్టుల పరిధిలో ఏర్పాటు చేయటం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరు వర్గాల కక్షిదారులు సమన్వయంతో ఆలోచించుకొని రాజీ చేసుకుంటే ఇది వర్గాల మధ్య స్నేహపూరిత సహకారం తో కలిసి మెలిసి సంతోషంగా ఉంటారని, ఇది ఆ వర్గాలకు సమయం, డబ్బు, ఆదా అవుతుందన్నారు. ఈ లోక్ అదాలత్ రాజీ చేసుకుంటే ఇరువర్గాల కక్షిదారులకు చాలా ఉపయోగమని, భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు ఉండవని, ఈ లోక్ అదాలత్ లో రాజీ పడదగిన కేసులు, ఫ్యామిలీ కేసులు, ప్రమాద బీమా కేసులు, చెక్ బౌన్స్ కేసులు, సివిల్ కేసులు మొదలైన కేసులు రాజీ పరిష్కారం చేసుకొని ఇరు వర్గాల కక్షిదారులు సంతోషంగా ఉండవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణి బాబు, సీనియర్ న్యాయవాదులు దర్శి అర్జున్, మట్ట ప్రసాద్, కొమ్మినేని మౌళేశ్వరరావు, పి.కృష్ణ ప్రసాద్ ఎం ఎల్ ఎస్ సి స్టాఫ్ గంగా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## శంకర్ నేత్రాలయం వారి ద్వారా 8 మందికి కంటి ఆపరేషన్లు



**కృత్తివెన్ను,డిసెంబర్ 4 (వార్తాప్రభ) :** కృతివెన్ను ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పరిధి లోని మాట్లం నుంచి ఐదుగురు గరిశపూడి నుంచి ఇద్దరు సీతనపల్లి నుంచి ఒక్కరు కంటి శుక్లం ఆపరేషన్ కోసం శంకర్ నేత్రాలయ ఏలూరు కీ పంపించడం జరిగిందని మొత్తం 8 మందిని ఆరోగ్యశ్రీ ద్వారా కంటి ఆపరేషన్ కి రెఫరల్ చేశామని వైద్యాధికారి సాయి సందీప్ తెలిపారు రెండు నెలలకి ఒకసారి శంకరనేత్రాలయ వెహికల్ వస్తుందని వల్లే తీసుకు వెళ్లి మరల వాళ్ళే తిరిగి తీసుకొచ్చి దింపేస్తారని శుక్లం ఉన్న వాళ్ళు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు

## ఆపద్బాంధవుడు ఎమ్మెల్యే యార్లగడ్డ, రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడికి తక్షణ సహాయం



**హనుమాన్ జంక్షన్,డిసెంబర్ 4 (వార్తాప్రభ) :** రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యశాలలో చికిత్స పొందేందుకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న యువకుడి పాలిట ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆపద్బాంధవుడులా నిలిచి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి సాయం అందజేశారు. బాపులపాడు మండలం తిప్పనగుంట గ్రామానికి చెందిన ముద్రాల ప్రవీణ్( 24) గత నెల 28 వ తేదీ గుడివాడ సమీపంలోని నాగారప్పాడు వంతెన వద్ద కారు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన యువకుడిని గుడివాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్చగా మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని స్వర హాస్పటల్ కు తరలించారు. క్షతగాత్రుడికి తక్షణమే ఆపరేషన్ చేయాలని నాలుగు లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ప్రవీణ్ కుటుంబ సభ్యులు కాకులపాడు ఛానల్ డిసి చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ ను కలసి ప్రభుత్వం నుండి సహాయం అందించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. సమస్యను రాజేష్ ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించిన ఆయన స్వర హాస్పటల్ యాజమాన్యంతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించవల సిందిగా ఆదేశించారు. వైద్యచికిత్సకు సాయం మంజూరు చేయాలని ముఖ్యమంత్రి సహాయానిదికి సిఫార్సు చేయటంతోపాటు ఎల్ ఓ సి మంజూరయ్యేంతవరకు ముఖ్యమంత్రి సహాయ నిధి కార్యాలయంతో సంప్రదింపులు జరిపారు. యార్లగడ్డ సిఫార్సు మేరకు రూ. 3 లక్షలు సీఎం సహాయ నిధి నుండి మంజూరు అయ్యాయి. గురువారం ఉదయం ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్ఓసిని ప్రవీణ్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే వెంకట్రావు అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ కుటుంబం పాలిట యార్లగడ్డ వెంకట్రావ్ ఆపద్బాంధవుడులా నిలిచి మెరుగైన వైద్యం అందేటట్లు చూడడమే కాకుండా,రూ. 3 లక్షల సాయం ఏర్పాటు చేసి , ఆదుకున్నం దుకు వెంకట్రావుకు రుణపడి ఉంటామని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాకులపాడు ఛానల్ డిసి చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, తిప్పనగుంట గ్రామ పాలకేంద్రం ప్రెసిడెంట్ బుద్దాల రంగారావు, కొడాలి చిట్టిబాబు, వేపూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు

## 2,51,341 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

-మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు



**విస్సన్నపేట,డిసెంబర్ 4 (వార్తాప్రభ) :** స్థానిక మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను రెండు లక్షల 51 వేల 341 రూపాయల చెక్కులను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రాయల సుబ్బారావు, రాష్ట్ర టిడిపి నాయకులు నెక్కలపు వెంకటేశ్వరావు (బద్దె),తెలుగుదేశం పార్టీ టౌన్ అధ్యక్షుడు కొంగల శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తిరువూరు ఏఎంసి డైరెక్టర్ పల్లెపాం రాంబాబు, విసన్నపేట సొసైటీ అధ్యక్షుడు కంభంపాటి బద్రీనాథ్, కొర్లమండ టిడిపి సీనియర్ నాయకులు కే రాజా, చంద్రుపట్ల టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు వడ్లమూడి మాధవ రావు, కమతం సురేష్, బీసీ యువ నాయకులు ముత్తం శెట్టి వంశీ, దాయక నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకుని కుటుంబాన్ని పరామర్శించిన ఎస్సీ కమిషన్ చైర్మన్

-కొత్తపల్లి శామ్యూల్ జవహర్



**విస్సన్నపేట,డిసెంబర్ 4 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో ఇటీవల మరణించిన టిడిపి నాయకులు అబ్బినేని రామాంజనేయులు చిత్రపటానికి ఎస్ సి కమిషన్ చైర్మన్ కె ఎస్ జోహార్ నివాళులర్పించి ఆయన కుమారుడు టిడిపి యువ నాయకులు మల్లికార్జున్ రావును మరియు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు, రాష్ట్ర టిడిపి నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు( బద్దే ) ఆర్ బి ఎస్ జాతీయ అధ్యక్షులు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వర రావు, పట్టణ టిడిపి అధ్యక్షులు కొంగల శ్రీనివాసరావు కూటమి నాయకులు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

## ఐసిడీఎస్ వారి ఆధ్వర్యంలో స్టాల్లను ఏర్పాటు.....



**పెనుగంచిప్రోలు, డిసెంబర్ 4 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు ప్రాజెక్ట్ పరిధిలోని పెనుగంచిప్రోలు గ్రామంలో ఇగ్నైట్ సెల్లో భాగంగా గుర-ువారం ఐసిడిఎస్ కు సంబంధించి స్టాల్లను మండల పరిషత్ కార్యాలయం లో ఏర్పాటు చేయడం జరిగింది ఇందులో భాగంగా ప్రీస్కూలు కిట్టును మరియు ఐసిడిఎస్ లో ఇచ్చే ఫుడ్ ను ఏర్పాటు చేయడం జరిగింది . తల్లులను పిలిపించి బాలామృతం గురించి బాల సంజీవిని కిడ్స్ గురించి వివరించడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్క పూడి గాంధీ సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ ఏవో సిద్ధారెడ్డి పంచాయతీ సెక్రెటరీ శ్యామ్కుమార్ స్కూల్ టీచర్స్ అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు భూసార పరీక్షలపై అవగాహన



**రౌతులపూడి,డిసెంబర్ 4 (వార్తాప్రభ) :** రౌతులపూడి మండలంలో ఏ మల్లవరం పరిధిలో ఉన్న అంబేద్కర్ సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాల విద్యార్థులకు భూసార పరీక్షలపై వ్యవసాయ శాఖ, ఆత్మ వారు సౌజన్యంతో భూసార పరీక్షల ఆవశ్యకత, ప్రాధాన్యత మట్టి నమూనాలు సహకరించే విధానం తీసుకోవలసిన జాగ్రత్తలు,మట్టిలో ఉన్న స్థూల మరియు సూక్ష్మ పోషకాలు గురించి , భూసార పరీక్ష పత్రం అంశాలపై అవగాహన కార్యక్రమం కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ( ఆర్.ఈశ్వరరా రావు ( వైస్ ప్రిన్సిపాల్ ఎన్ సాయి సైన్స్ టీచర్ ( ఆర్ రాజు బి టి యం నాయుడు, టీచర్స్ , వ్యవ సాయ సహాయకులు ( సతీష్) సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కృషి చేయాలి



**సఖినేటిపల్లి,డిసెంబర్ 4 (వార్తాప్రభ) :** అంతర్వేదిలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వ యంతో భక్తులకు ఎటువంటి అసౌక ర్యం కలగకుండా పటిష్టమై న చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టరు ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. గురువారం అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వా మి ఉత్సవాలు 2026 ఏర్పాట్ల పై అధికారులు ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం జిల్లా కలెక్టరు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ కాశీగా పేరొందిన అంతర్వేది క్షేత్రం మహిమాన్వితమైనదన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో విరాజిల్లుతున్న నర్సింహుని క్షేత్రాలలో ఇది పురాణ ప్రసిద్ధి చెందింద న్నారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణానికి రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తార న్నారు. స్వామివారి కల్యాణంలో భక్త కుటుం బాల వారే కర్తలుగా శుభ కార్యక్రమం జరిపించడంలో ముఖ్య భూమిక పోషిస్తు న్నారన్నారు. ఏటా మాఘ మాసంలో శుద్ధ సప్తమి (రథసప్తమి)నుంచి తొమ్మిది రోజులపాటు క్షేత్రంలో లక్ష్మీనరసింహుని దివ్య తిరుకల్యాణ మహోత్స వాలు కనుల పండుగగా సాగు తాయన్నారు. ఏడాది 2026 జనవరి 25 నుండి ఫిబ్రవరి రెండో తేదీ వరకు శ్రీ స్వామివారి దివ్య కళ్యాణ ఉత్సవాలు కనుల పండుగ గా నిర్వహించడం జరుగు తుందన్నారు. మాఘమాసం సూర్యభగ వానుడికి ప్రీతికరమైందనీ రథ సప్తమి రోజు నుంచి కళ్యాణో త్సవాలు మొదలు పెట్టడం ఆనవాయితీగా వస్తోం దన్నారు. జనవరి 25న చంద్రప్రభ వాహన గ్రామో త్సవం, 26 హంస వాహ నంపై గ్రామోత్సవం ధ్వజారోహణ 27 సింహ వాహన గ్రామోత్సవం 28 శ్రీ స్వామివారి తిరు కళ్యాణోత్సవం 29 స్వామి వారి రథోత్సవం 30 పొన్న వాహనంపై గ్రామోత్సవం ఫిబ్రవరి ఒకటవ తేదీ చక్రవారి సముద్ర స్నానం ధ్వజారోహణ రెండో తేదీ పుష్పక వాహనం హంస వాహనం తెప్పోత్సవ కార్యక్రమాల అనంతరం ఉత్సవాలు ముగిస్తాయ న్నారు. గత ఏడాది మాదిరిగానే అధికారులకు విధు లు బాధ్యతలను కేటాయించడం జరిగిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రసంగిస్తూ గత ఏడాది కన్నా 20 శాతం భక్తుల రద్దీ పెరిగేందుకు ఆస్కారం ఉందని తెలిపారు. అంతర్వేది ప్రాంతంలో ఇటీవల సంభవించిన మొ%శీ%థా తుఫాన్ ప్రభావంతో 100 కిలోమీటర్లు వేగంతో ఈదురుగాలులు వేస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిందని అటువంటిది కేవలం 70 మీటర్లు వేగంతో ఎలా వచ్చిందో ప్రతి ఒక్క రూ సింహావలోకనం చేసు కోవాలని దానికి స్వామివారి మహిమే కారణమని శాసనసభ్యులు తెలిపారు. దానికి దీటుగా ఈ ఏడాది ఉత్సవాలు నిర్వహించి స్వామివారి మహిమను విశ్వవ్యాప్తం చేయాలని సూచించారు. స్వామి వారికి 9 బుధవారాలు 9 ప్రదక్షిణలు చేసుకున్న తర్వాత హోమం నిర్వహిస్తే దానివల్ల మహత్తరమైన ఫలితాన్ని పొందవచ్చునని చరిత్ర సూచిస్తుందన్నారు. ఏడాది ఉత్సవాలకు గరిష్టంగా 10 లక్షలు మంది భక్తులు తరలివచ్చే ఆస్కారం ఉందని దానికి తగ్గట్లు జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసి అంగరంగ వైభవంగా ఉత్స వాలను నిర్వహించుకునే బాధ్యత అందరిపై ఉంద న్నారు. ప్రోగ్రెసివ్ భక్తులు తాకిడి పెరిగేందుకు అవకాశం ఉందని రహదారి సౌకర్యాలు శానిటేషన్ వసతులు మెరుగుపరచాల్సిన అవసరం ఉంద న్నారు స్వామివారిని దర్శించుకునేందుకు అవకాశాలు మెరుగుపరచాల్సిన అవ సరం ఉందన్నారు. వాడపల్లిలో వసతులు మెరుగుపరచిన కారణంగా భక్తులు తాకిడి విపరీతంగా పెరిగి దేదీప్యమానంగా వెలు గొందుతోందని ఆ విధంగానే స్థానికంగా కూడా స్వామివారి మహి మలను తెలియ చెబుతూ కళ్యాణోత్సవాలు నిర్వహించాలని సూచించారు. మధ్యలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరారు. అంతర్వేది కల్యాణోత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి లేఖలు రాయడం జరిగిందని మంత్రి కూడా కోరడం జరుగుతుం దన్నారు. గత 4 సంవత్సరాల క్రితం రథం కాలిపోయిన పరిస్థితి మూలంగా అపరిస్కృతంగా దేవస్థానం ఉందని దీనిని ఒక ప్రాసెస్ ప్రకారం నిమజ్జనం చేయవ లసిన అవసరం ఉందన్నారు. గతంలో కోనేరు తెప్పో త్సవం కొరకు ఉండేదని ఇటీవల కాలంలో ఆ కోనేటిని త్రాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నా రని, మరల కోనేటిని పునరుద్ధరించి తెప్పోత్సవ నిర్వహణకు సిద్ధపరచాలని అందుకు సుమారుగా రూ.2 కోట్లు మేర అంచనా వ్య యం రూపొందించడం జరిగిందన్నారు. అదేవిధంగా స్థానికంగా ఉన్న ఐదు ఎకరాలలో బస్ టెర్మినల్ నిర్మిస్తే భక్తులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కోనేటి పునరుద్ధరణ బస్ టెర్మినల్ నిర్మాణాలకు దాతలు ముందుకు వస్తే వారి పేరిట నిర్మాణాలు చేపడతామ న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఆర్డీవో కే మాధవి, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ చైర్మన్ రాజా కలిదిండి కుమార్ రామ గోపాల రాజా బహుదూర్ డిప్యూటీ కమిషనర్ రమేష్, అసిస్టెంట్ కమిషనర్ వి సత్యనారాయణ ఈవో ఎం కే టి ఎన్ వి ప్రసాద్, డీఎస్పీ తదితరులు పాల్గొన్నారు.

# కనుల పండుగగా దత్త సాయి జయంతి!!

- సాయి స్మరణతో మార్మోగిన మందిరం
- ఆలయ అభివృద్ధికి ప్రాంత వాసిగా సహకారం అందిస్తా
- కాంపౌండ్ వాల్, కమ్యూనిటీ హాల్ త్వరలో నిర్మిస్తా
- రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్





**పెద్దపల్లి/ రామగుండం: డిసెంబర్ 4 (వార్తాప్రభ ప్రతినిధి)** కనుల పండుగగా దత్త సాయి జయంతి వేడుకలు గురువారం రామగుండంలోని శిరిడి సాయిబాబా మందిరంలో ఘనంగా నిర్వహించారు ఆలయ కమిటీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్. దత్త సాయి జయంతి వేడుకల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పుష్పాభిషేకం పసుపు కుంకుమ అర్చన వంటి విశిష్ట పూజా కార్యక్రమాలను కనులారా తిలకించారు. సాయి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగినది. ఈ వేడుకలకు రామగుండం శాసన సభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.....ఆలయ అభివృద్ధికి ప్రాంత వాసిగా సహకారం అందిస్తా అని వీలైనంత త్వరగా కాంపౌండ్ వాల్, కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడతామని భక్తులకు ఆలయ కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, మహిళలు అందరూ కలిసి ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. నిత్య దూప, దీప నైవేద్యాలు అలాగే విశిష్ట పూజా కార్యక్రమాలు దత్త సాయి మందిరంలో కొనసాగాలి అని దానికి అనుగుణంగా ఆలయ అభివృద్ధికి తాను కట్టుబడి ఉంటానని ఎమ్మెల్యే తెలిపారు. రాంపల్లి మురళీధర శర్మ మంత్రోచ్ఛరణల నడుమ వేడుకలు ఘనంగా కొనసాగాయి.

# ముక్కుసూటి రాజకీయ నేత రోశయ్య!!

***వివిధ పదవులకి వన్నెతెచ్చిన మహానేత***

***నిస్వార్థ ప్రజాసేవ, పరిపాలన నైపుణ్యం అమోఘం***

***రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా***



**పెద్దపల్లి/ రామగుండం: డిసెంబర్ 4 (వార్తాప్రభ ప్రతినిధి)**ముక్కుసూటి రాజకీయ నేత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రోశయ్య అని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రశంసించారు. ఈ మేరకు గురువారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి రోశయ్య వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి సిపి ఘన నివాళులు అర్పించారు. అనంతరం సిపి మాట్లాడుతూ.......కొనజేటి రోశయ్య ఆదర్శవంతమైన జీవితం గడిపాడని, అంచెలంచెలుగా ఎదుగుతూ ముఖ్యమంత్రి పదవిని అలంకరించిన మహనీయుడని రోశయ్య సేవలను కొనియాడారు. రోశయ్య ముఖ్యమంత్రిగా పలు ప్రజాసంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి, రాష్ట్రంలో అద్భుత ప్రగతిని సాధించారన్నారు. నిస్వార్థ ప్రజాసేవ, పరిపాలన నైపుణ్యం అమోఘం అని వారి సేవలను కొనియాడారు.

# అపురూప కాలనీలో ఘనంగా "క్రిస్మస్ సెలబ్రేషన్స్" వేడుకలు...



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 4, (వార్తాప్రభ)** : కుత్బుల్లాపూర్130 – సుభాష్ నగర్ డివిజన్ అపురూప కాలనీలోని మెస్సియా గాస్పెల్ చర్చ్ నందు పాస్టర్స్, క్రిస్టియన్స్, మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ సెలబ్రేషన్స్ కార్యక్రమానికి గురువారం బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ ప్రేమ, శాంతి, సామరస్యాలకు ప్రతీక క్రిస్మస్ వేడుకలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, ఏవీ శేషా చారి, అపురూప కాలనీ సెక్రటరీ రమణ, మాజీ అధ్యక్షులు గణేషన్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, రెవ. ఏఎస్. పాల్, రేవ డా. కె. డానియల్ సాల్మన్, రేవ.టి. శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

# గెలిపిస్తే "సదా" ఆనందమే!!

● "గడ్డం" నాయకత్వంతో సుందిల్లకు మహర్దశ ● ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా ● సింగరేణి ప్రభావిత గ్రామానికి హక్కులన్నీ సాధిస్తా ● నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తా ● అత్యధిక సిఎస్ఆర్ నిధులతో గ్రామ అభివృద్ధి ● సుందిళ్లను రోల్ మోడల్ "జీపీ"గా తీర్చిదిద్దుతా ● సుందిళ్ల గ్రామ సర్పంచ్ అభ్యర్థి గడ్డం సదయ్య(సదానందం)





**పెద్దపల్లి/ సుందిల్ల: డిసెంబర్ 4 (వార్తాప్రభ ప్రతినిధి)** తనని గెలిపిస్తే "సదా" ఆనందమే అని కొందరు, "గడ్డం" నాయకత్వంతో సుందిల్లకు మహర్దశ వచ్చే అవకాశాలు బోలెడు అని యువత, విశిష్ట ప్రయోజనాలు కలుగుతాయని గ్రామ ప్రజలు బహిరంగంగా, సోషల్ మీడియా వేదికగా తమ అభిప్రాయాలను వెలిబుచ్చుచుండడం చూస్తుంటే సుందిళ్ల గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన గడ్డం సదయ్య అలియాస్ గడ్డం సదానందం గెలుపు నల్లేరుపై నడక గానే కనిపిస్తున్నది. గ్రామంలో ఎక్కడ నలుగురిని అడిగిన ఇద్దరు ముగ్గురు గడ్డం సదయ్యకే ఈసారి అన్నట్లు సంకేతాలు ఇస్తున్నారు. కత్తెరకు గుద్దుడే అని పెద్దలు ఆశీర్వాదం ఇస్తున్నారు. నామినేషన్ వేసిన నాటి నుంచి గ్రామ ప్రజలను నిత్యం కలుస్తూ అభివృద్ధి ప్రణాళికను అభ్యర్థి సదయ్య క్లుప్తంగా వివరిస్తున్నాడు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా అని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తా అని, అత్యధిక సిఎస్ఆర్ నిధులతో గ్రామ అభివృద్ధి చేస్తా అని, సుందిళ్లను రోల్ మోడల్ "జీపీ"గా తీర్చిదిద్దుతా అని తన హామీలను తెలియజేస్తున్నాడు. గ్రామాల్లో సరిపడా మినరల్ వాటర్ ప్లాంట్లను, నిరుద్యోగ యువతీ యువకుల కోసం సెంట్రల్ లైబ్రరీ, వృద్ధుల కొరకై సీనియర్ సిటిజన్ హాల్, నిరుపేదల శుభకార్యాలు, ఇతరత్రా కార్యక్రమాలు చేసుకోవడానికి కమ్యూనిటీ హాల్, మహిళల ఉపాధి కోసం కుట్టు శిక్షణ ఇతర శిక్షణ కేంద్రాలు, క్రీడలను ప్రోత్సహించడానికి స్పెషల్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంపులు, నిత్య పారిశుద్ధ్య నిర్వహణ, లైటింగ్ అలాగే రోడ్ల వ్యవస్థ, ప్రజల ఆరోగ్యం కోసం తరచూ మెడికల్ క్యాంపులు, ఉచితంగా మందుల పంపిణీ జరిగే విధంగా తన పాలన ఉంటుంది అని చేతులు జోడించి మరీ తనను గెలిపించాలి అని కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

# జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి

***జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్***



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిసెంబర్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కొత్తగూడెం,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్ట్ లో డిసెంబర్ 21 వ తారీకున జరిగే జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్ మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మీ మీద కానీ, మీకు తెలిసిన వాళ్ల మీద కానీ, మీ బంధువుల మీద కాని ఏమైనా కేసులు ఉన్నట్లైతే వాటిని (కాంప్రమైజ్ ) రాజీ చేసుకోవచ్చని అన్నారు. కక్షిదారులు తమ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవడం వలన సమయం, డబ్బు అదా అవుతుందని అన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారం కొరకై ఈ లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నామని తెలిపారు. కావున అత్యధిక కేసులను పరిష్కరించడం కొరకు పోలీసు అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. 1.యాక్సిడెంట్ కేసులు 2.సివిల్ కేసులు 3.చీటింగ్ కేసులు 4.చిట్ ఫండ్ కేసులు 5.భూతగాదాలు కు సంబంధించిన కేసులు 6.వివాహ బంధానికి సంబంధించిన కేసులు 7.చిన్నచిన్న దొంగతనం కేసులు 8.ట్రాఫిక్ చాలాన్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 9. కుటుంబ తగాదాలు 10. బ్యాంకు లావాదేవీల కేసులు11. టెలిఫోన్ బకాయిల కేసులు 12. కొట్టుకున్న కేసులు 13. సైబర్ క్రైమ్ కేసులు 14. చెక్ బౌన్స్ కేసులు ఈ లోకదాలత్ లో రాజీ చేసుకుని, కేసును పూర్తిగా క్లోజ్ చేసుకునే అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# అభివృద్ధికి బ్యాక్ బోన్ సర్పంచ్ నిజాయితీ!!

● గ్రామపంచాయతీ డెవలప్మెంట్ కోసం కృషి చేస్తా ● ఒకరోజు కడుపు నింపుకోవడం కోసం ఓట్లు అమ్ముకోకండి ● మద్యం, డబ్బు, గిఫ్టుల ఆశకు కక్కుర్తి పడకండి ● నిజాయితీగా ఓటు వేయండి వెన్నెలని ఆశీర్వదించండి ● అంతకు పదిరెట్లు నిజాయితీగా ప్రజాసేవ చేస్తా ● మీ ఇంటి మనిషిగా కష్టసుఖాల్లో తోడుంటా ● మంది, మార్బలం, పరపతి చూసి మోసపోకండి ● ఎల్కలపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి వడ్లకొండ వెన్నెల

**పెద్దపల్లి/ఎల్కలపల్లి: డిసెంబర్ 4 (వార్తాప్రభ ప్రతినిధి)**దేశంలోని ఏ గ్రామ అభివృద్ధికి అయినా బ్యాక్ బోన్ సర్పంచ్ నిజాయితీగా ప్రజా సేవ చేయడమే అని ఎల్కలపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి వడ్లకొండ వెన్నెల అన్నారు. ఈ మేరకు గురువారం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ ప్రజలతో కలిసి మాట్లాడారు. తనని సర్పంచ్ గా గెలిపిస్తే చేయబోయే అభివృద్ధి పనులను క్లుప్తంగా వివరించారు. గ్రామపంచాయతీ డెవలప్మెంట్ కోసం కృషి చేస్తా అని తెలిపారు. ఒకరోజు కడుపు నింపుకోవడం కోసం ఓట్లు అమ్ముకోకండి అని మద్యం, డబ్బు, గిఫ్టుల ఆశకు కక్కుర్తి పడకండి అని విజ్ఞప్తి చేశారు. నిజాయితీగా ఓటు వేయండి వెన్నెలని ఆశీర్వదించండి అని చేతులు జోడించి వేడుకున్నారు. అంతకు పదిరెట్లు నిజాయితీగా ప్రజాసేవ చేస్తా అని మీ ఇంటి మనిషిగా కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తానని హామీ ఇచ్చారు. మంది, మార్బలం, పరపతి చూసి మోసపోకండి అని కోరారు.



# ప్రజలందరిపై "గురుదత్త" ఆశీస్సులు ఉండాలి

***కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్***





**శేరిలింగంపల్లి,డిసెంబర్ 4 (వార్తాప్రభ)**:శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ లోగల నేతాజీనగర్ లో శ్రీశ్రీశ్రీ దత్త జయంతి ని పురస్కరించుకుని శ్రీసాయి బృందావన క్షేత్రంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దత్త జయంతి వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర యువజన నాయకులు రాగం అనిరుధ్ యాదవ్.ఆలయ పండితులు కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ని,రాగం అనిరుధ్ యాదవ్ ని పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.అనంతరం కార్పొరేటర్ సాయిబాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బాబా వారి కృపకు పాత్రులయ్యారు.అనంతరం దత్తాత్రేయ జయంతి వేడుకల్లో భాగంగా అభిషేకాలు,గణపతి,నవగ్రహ,రుద్రహోమా మాలను నిర్వహించారు.రాష్ట్ర యువజన నాయకులు రాగం అనిరుధ్ యాదవ్ భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దత్తాత్రేయుడు అత్రి మహర్షికి జన్మించి ముని బాలకుడు అనిపించినా దత్త మహర్షికి ఉన్న జ్ఞానం అపారమని,సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు అయినందు వల్ల గురువుగా భావిస్తామని అన్నారు.ప్రజలందరిపై ఆ గురుదత్త ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ పండితులు రాఘవేంద్ర శర్మ, రాష్ట్ర యువజన నాయకులు రాగం అభిషేక్ యాదవ్,రాష్ట్ర బీసీ కులాల ఐక్యవేదిక సంఘ అధ్యక్షులు భేరి రాంచందర్ యాదవ్,స్వరూప,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్

# విజయ వినాయక దేవస్థానంలో మైనంపల్లి ప్రత్యేక పూజలు



**మల్కాజిగిరి : డిసెంబర్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** దత్తాత్రేయ జయంతి సందర్భంగా గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని వాణి నగర్ విజయ వినాయక దేవస్థానంలో మల్కాజ్ గిరి మాజీ ఎమ్మెల్యే మైనపల్లి హనుమంతరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు ఛైర్మెన్ సిరిగిరి రాజు, పివి సత్యనారాయణ,బలరాం, వీరభద్రరావు,జన్నయ్య,లక్ష్మి, ఈవో వెంకన్న,ఆలయ పండితులు వేణుగోపాల్ శర్మ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బి కే శ్రీనివాస్, గుండా నిరంజన్, పిట్టల శ్రీనివాస్ , జి ఎన్ వి సతీష్ కుమార్ , డివిజన్ అధ్యక్షులు వైనాల ప్రవీణ్, సంపత్ గౌడ్ వినోద్ యాదవ్, సయ్యద్ మబ్బు, సంతోష్ రాందాస్ ముదిరాజ్, బాబు సత్యనారాయణ, ఆశా ప్రభ ఇందిరా ప్రియదర్శిని, బాలరాజు యాదవ్ ఆగమయ్య, సురేష్ సింగ్, ఇస్తారి రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

# సుబ్రహ్మణ్యస్వామి రచించిన శ్రీ ధర్మశాస్తా తంత్రం పుస్తకావిష్కరణ





**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 4, (వార్తాప్రభ)** : సూరారం కాలని శ్రీ సంతోష్ నగర్ లోని శ్రీ నిఖిల సాయి మైత్రేయ మధుసూదన సరస్వతి పీఠంలో గురువారం దత్త జయంతి పురస్కరించుకొని పూజ్య గురుదేవులు కీ? శే? శ్రీ స్వామి మధుసూదన సరస్వతి వారి అనుగ్రహ ఆశీస్సులతో సుబ్రహ్మణ్యం స్వామి చే నూతనంగా రచించబడిన శ్రీ ధర్మశాస్తా తంత్రం పుస్తకాన్ని రచయిత మాతృమూర్తి భాగ్యలక్ష్మి చేతులమీదుగా ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ అయ్యప్ప స్వామి మాలదారులకు మరియు గురు స్వాములకు చాలావరకు అయ్యప్ప స్వామి జీవిత చరిత్ర తెలియకపోవడం వాస్తవమని, సినిమాలలో చూపించిన కథలనే వాస్తవాలుగా భక్తులు పరిగణించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సందర్భంలో సుబ్రహ్మణ్యస్వామి ఎన్నో సంవత్సరాలు అయ్యప్ప స్వామి జీవిత చరిత్ర పై పరిశోధనలు జరిపి ఎంతో సమాచారాన్ని సేకరించి శ్రీ ధర్మశాస్త్ర తంత్రం పేరుతో పుస్తకరూపంలో అయ్యప్ప స్వామి జన్మ రహస్యాన్ని భక్తులకు అందజేయడం మహదానందమని పేర్కొన్నారు. ఈ పుస్తకాన్ని ప్రతి సన్నిధానంలో అయ్యప్ప స్వామి భక్తుడు మాల ధారణ సమయంలో తప్పక పారాయణం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షులు చక్రధారి శ్రీరామ శర్మ, గడ్డం రాంబాబులు మాట్లాడుతూ అందరికీ సరస్వతి కటాక్షం ఉండదని అది కేవలం కొందరికి మాత్రమే ఉంటుందని అది సుబ్రహ్మణ్యస్వామికి పుష్కలంగా ఉందని అందుకే ఆ మాత కృపతో అద్భుతమైనటువంటి రచనలు వారి నుండి సమాజానికి అందుతున్నాయని అన్నారు. పుస్తక రచయిత సుబ్రహ్మణ్య స్వామి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి జీవిత చరిత్ర సేకరించడానికి తానెంతో కాలం కృషి చేశానని, కేరళలో పలు ప్రాంతాలు పర్యటించి సమాచారం సేకరించినట్టు తెలిపారు, ఆ కృషి ఫలితమే ఈనాడు పుస్తకావిష్కరణ జరిగిందని అన్నారు, భవిష్యత్తులో అయ్యప్ప స్వామికి సంబంధించిన మరింత సమాచారాన్ని భక్తులకు చేరవేసే ప్రయత్నం చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి మహాపడిపూజను నిర్వహించారు. ఇందులో సాంభశివరావు గురుస్వామి ఆధ్వర్యంలో జ్యోతి స్వరూప భజనమండలి వారు ఆలపించిన భక్తిగీతాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం ఏర్పాటు చేసిన బిక్షలో అయ్యప్ప స్వాములు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బిజేపి నాయకులు శంకర్, గణేష్, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉపేందర్, ప్రభాకర్, చంద్రశేఖర్, గడ్డం గోవర్ధన్, కుటుంబ సభ్యులు భాగ్యలక్ష్మి, నర్సింహమూర్తి, సూర్యకళ, సూర్య సుందరి, సాయిపుష్కల, విశ్వశ్రీ నాగేంద్రశర్మ, వెంకటరమణ, కుమార్ స్థానికులు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## రాజీనామాల రచ్చ.. జగన్ నిర్ణయం ఇదే.. !

వైసీపీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు రాజీనామాలు చేశారు. అయితే.. ఈ రాజీనామాలు ఆమోదించే విషయంలో తాత్సారం జరుగుతున్న విషయం తెలిసిందే. తెలంగాణలో ఎలా అయితే.. ఎమ్మెల్యేలు రాజీనామాలు చేసినా.. పట్టించుకోలేదో..ఇ క్కడ కూడా సేమ్ టు సేమ్ అన్నట్టుగా పరిస్థితి మారిపోయింది. దీంతో కోర్టు జోక్యం చేసుకుని 4 వారాల గడువు ఇచ్చింది. నాలుగు వారాల్లో ఏదో ఒకటి తేల్చేయాలని కోర్టు చెప్పింది. దీంతో రాజీనామా చేసిన కర్రి పద్మశ్రీ, బల్లి కల్యాణ చక్రవర్తి, మర్రి రాజశేఖర్, జకియా ఖానుం, జయమంగళ వెంకటరమణ, పోతుల సునీతలను మండలి చైర్మన్ మోషేన్ రాజు పిలిచి విచారించారు. అయితే.. వీరిలో జకియా ఖానుం తన రాజీనామాను వెనక్కి తీసుకున్నారు. ఈమెకు పదవీ కాలం ఆరు మాసాలే ఉండడంతో రాజీనామా చేయడం వల్ల ప్రయోజనం లేదని భావించిన ఆమె.. వెనక్కి తీసుకున్నారు. సో.. ఆరు మాసాలు ఆమె స్టాండ్‌బైలోనే ఉంటారు. ఇక, మిగిలిన ఐదుగురు పరిస్థితి ఏంటి? అనేది ఆసక్తిగా మారింది. అయితే.. వీరి రాజీనామాలను తిరస్క రించే అవకాశం ఉందన్న చర్చ రాజకీయ వర్గాల్లో కొనసాగుతోంది. తద్వారా మరికొన్నాళ్లు వారిని ఇరకాటంలో పెట్టే వ్యూహం ఉందని తెలుస్తోంది. దీనిని ఆయా ఎమ్మెల్సీల ద్వారా ప్రజల మధ్యకు తీసుకువెళ్లి.. వైసీపీపై యుద్ధం ప్రకటించే దిశగా టీడీపీ ఆలోచన చేస్తోంది. ఇదేసమయంలో మండలి చైర్మన్‌పైనా అవి శ్వాసం ప్రకటించే ఆలోచనలో కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారం వెనుక వైసీపీ ఉందని.. అందుకే తాత్సారం చేస్తున్నారన్న వాదన ఇప్పటికే వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా జగన్ దీనిపై నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఎలానూ వారు పార్టీకి రాజీనామా చేసారు కాబట్టి.. వారిని తిరిగి తీసుకునేది లేదని... కాబట్టి రాజీనామాల విషయంలో మండలి చైర్మన్ నిర్ణయం తీసుకోవాలని.. కీలక నాయకుడి ద్వారా.. మండలి చైర్మన్‌కు సమాచారం ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. అంటే.. ఇప్పటి వరకు వైసీపీ ఖాతాలో ఉన్న ఈ ఆరుగురికి దాదాపు వైసీపీ రాం రాం చెప్పేసింది. తద్వారా రాజకీయంగా జరిగే.. రచ్చ నుంచి బయట పడేందుకు ప్రయత్నాలుచేస్తున్నారు. దీంతో త్వరలోనే వారి రాజీనామాలు ఆమోదంపొందే అవకాశం ఉందని మండలి వర్గాలు చెబుతున్నాయి.

## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి.

**తెలంగాణ బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచందర్ యాదవ్**



హైదరాబాద్ , డిసెంబర్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి) తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలలో యాదవ సామాజిక వర్గానికి చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచంద్ర యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదవ బీసీ సామాజిక వర్గానికి చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ గెలుపు తెలంగాణ రాష్ట్రంలో నూతన అధ్యాయానికి మార్గమని రామచంద్ర యాదవ్ సూచించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక జనాభా కలిగిన బీసీల్లోని యాదవులకు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. అంతేకాక జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిచిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కు మంత్రివర్గంలో స్థానం కల్పిస్తే బీసీలు యాదవులు కాంగ్రెస్ వైపు మద్దతు ఉంటుందని విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. యాదవులను బీసీలను విస్మరించిన పార్టీలకు గతంలో ఎలాంటి గుణపాఠం చెప్పారో అందరికీ తెలిసిన ఈ విషయాన్ని ప్రస్తుత అధికార పార్టీ నాయకులు మర్చిపోవద్దని హితోపలికారు. యాదవుల ముద్దుబిడ్డ కనిపిస్తున్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కు తప్పకుండా రేవంత్ రెడ్డి సముచిత స్థానం కల్పించేలా మంత్రివర్గంలో అవకాశం ఇస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## శ్రేష్టమైనది స్నేహము



సృష్టిలోన తీయనిది
భేదాలే లేనిది
పరిశోధన చేయగా
స్నేహమే విలువైనది
త్యాగంతో కూడినది
క్షేమాన్నే కోరునది
ఆలోచన చేయగా
స్నేహమే శ్రేష్టమైనది
అసమానతలు ఎరుగనిది
వెన్నుపోటు పొడవనిది
గమనించి చూడగా
స్నేహమే సాటిలేనిది
ప్రేమలు వెదజల్లునది
వెన్నంటే ఉండునది
స్నేహమే లోకంలో
భుజం తట్టి నడుపునది

**-గద్వాల సోమన్న,**
గణితోపాధ్యాయుడు సెల్:9966

# పశ్చిమలో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకి ఘన నివాళులు

**కొణిజేటి రోశయ్యకి ఘననివాళులర్పించిన ఆర్యవైశ్య ప్రముఖులు, రోశయ్య అభిమానులు**





విజయవాడ పశ్చిమ డిసెంబర్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ స్వర్గీయ కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలోగల త్రిమూర్తి చౌక్ లోని రోశయ్య విగ్రహం వద్ద మాజీ మంత్రివర్యులు వెలంపల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు ఆధ్వర్యంలో కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆర్యవైశ్య ప్రముఖులు, రోశయ్య అభిమానులు పాల్గొని కొణిజేటి రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, తమిళనాడు రాష్ట్ర గవర్నర్ గా కొణిజేటి రోశయ్య విశేష సేవలందించారని, మచ్చ లేని మనిషిగా గుర్తింపు పొందారని, ఆయన జీవితం అందరికి ఆదర్శప్రాయమని అన్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచినా వ్యక్తి కొణిజేటి రోశయ్య ని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పదిహేనుసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సుదీర్ఘ కాలంపాటు ఆర్థిక మంత్రిగా పనిచేసిన ఘనత రోశయ్యదేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు వేముల హజరతయ్య గుప్తా, సేవాదల్ అధ్యక్షులు శేగు వెంకటేశ్వరరావు, ఐవిఎఫ్ కార్యదర్శి గొంట్ల మోహనరావు, అన్నం రామకృష్ణారావు, ఓలేటి రంగ, మద్దు బాలు, సంకా పరమేష్, యువజన సంఘం అధ్యక్షులు సంపత్, వివిధ డివిజన్ల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, ఆర్యవైశ్య ప్రముఖులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యువతను నిర్వీర్యం చేస్తూ నేర సంస్కృతిని ప్రేరేపిస్తున్న గంజాయి మత్తు పదార్థాల ను ప్రభుత్వం పూర్తిగా నిషేధించాలి

**హాలో యువత మేలుకో - చెడు వ్యసనాల నుండి నిన్ను నువ్వు కాపాడుకో వాల్ పోస్టర్ ఆవిష్కరణ**



విజయవాడ పశ్చిమ డిసెంబర్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర బాబు ఆధ్వర్యంలో గురువారం యువతను నిర్వీర్యం చేస్తూ నేర సంస్కృతిని ప్రేరేపిస్తున్న గంజాయి మత్తు పదార్థాల ను ప్రభుత్వం పూర్తిగా నిషేధించాలని అఖిల బారత యువజన సమాఖ్య ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర డిమాండ్ చేసారు.ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ప్రచురించిన హలో యువత మేలుకో - చెడు వ్యసనాల నుండి నిన్ను నువ్వు కాపాడుకో వాల్ పోస్టర్ ను హనుమాన్ పేట దాసరి భవన్ లో పోస్టర్ ఆవిష్కరణ చేసారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో అధికారంలోకి వచ్చిన వెంటనే గంజాయి రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని ఉత్తమ కుమార ఉపన్యాసాలు ఇచ్చి ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం, ప్రత్యేక దళాలను ఏర్పాటు చేస్తున్నాం. గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే బాధ్యత మాది అంటూ ప్రగల్బాలు పలికిన ప్రభుత్వ పెద్దలు అధికార పార్టీ నాయకులు నేడు రాష్ట్రంలో వరుస ఘటనలు జరుగుతున్న ఏమైపోయారనే ప్రశ్న అందరిలోనూ తలెత్తుతున్నదన్నారు.ప్రతిరోజు గంజాయి రవాణా జరుగుతుందని ప్రతిరోజు ఎక్కడో ఒకచోట గంజాయిని పట్టుకున్నాం అనే వార్తలు రోజు చూస్తూనే చదువుతూనే ఉన్నామని అన్నారు.ఎప్పుడూ లేనివిధంగా విశ్వవిద్యాలయాలు, మొదలుకొని పాఠశాలల వరకు మారుమూల గ్రామాలు మొదలుకొని రాష్ట్ర రాజధాని ప్రాంతాలైన విజయవాడ గుంటూరులలో సైతం గంజాయి బహిరంగంగా విచ్చలవిడిగా దొరుకుతున్నది అనేది బహిరంగ రహస్యం అనిగంజాయిని సేవిస్తున్న వారు, దాన్ని విక్రయిస్తున్న వారు, గంజాయి విక్రయదారులకు భుజం కాస్తున్న రాజకీయ పార్టీల నేతలు సాగిస్తున్న హత్యలు సమాజాన్ని కలవర పరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈమధ్య నెల్లూరు నగరంలో పెంచలయ్య అనే యువకుడ్ని పట్టపగలే స్కూటర్ తో ఢీ కొట్టి ఖర్చులతో చచ్చిన ఘటన చూస్తే గంజాయి మాఫియా ఎంత భరితగించిందో అర్థమవుతుందన్నారు.నెల్లూరు ఘటన ఒక ఉదాహరణ మాత్రమే అనిగంజాయి బారిన పడి ఏ విధంగా లైంగిక వేధింపులు జరుగుతున్నాయిఅత్యాచారాలు జరుగుతున్నాయి, దాడులు దోపిడీలు జరుగుతున్నాయో రోజు చూస్తూనే ఉన్నామన్నారు.గత ఆరు నెలల్లో గంజాయి, మత్తు పదార్థాల సంబంధిత కేసుల్లో అరెస్ట్ అయిన యువకుల సంఖ్య పెరిగిపోయిందని. హై స్కూల్ స్థాయి పిల్లల నుండి ఇంజనీరింగ్ పీజీ యూనివర్సిటీ స్థాయి యువత వరకు గంజాయి చేరుతుందంటే ఈ మాఫియా కొన్న నెట్వర్క్ ఎంతవరకు విస్తరించిందో అర్థం చేసుకోవచ్చన్నారు. పది సంవత్సరాల వయసు నుండి 17 సంవత్సరాల వయసున్న మైనర్ బాలికలు 88 లక్షల మంది మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసుల్లో చిక్కుకున్నట్లు జాతీయ నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో గణాంకాలు చెబుతున్నాయి వీటికి అలవాటు పడ్డ పిల్లలు డబ్బు కోసం వృద్ధులు పైన కుటుంబ సభ్యుల పైన చేసిన నేరాలు 31,365 కేసులు నమోదయ్యాయని గుర్తుచేశారు.ఇన్ని ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వాలు చోద్యం చూస్తూ ఎందుకు అరికట్టలేక పోతున్నాయి.అన్నది ప్రతి పౌరునికి కలిగే సందేహమనిగంజాయి అక్కడక్కడ పట్టు పడుతుంది పట్టుకుంటున్నామనే వార్తలు తప్ప దాని మూల కేంద్రాల జోలికి పాలకులు పోవడం లేదు. ఆపరేషన్ కగారు పేరిట నక్సలైట్ల కోసం అడవులను గాలించగల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పాలకులకు యువత ఆరోగ్యాన్ని దెబ్బతీస్తూ హత్యలకు అరాచకాలకు కారణమవుతూ యువతను నిర్వీర్యం చేస్తూ నేర సంస్కృతిని ప్రేరేపిస్తున్న గంజాయి పంటను గాలించి ధ్వంసం చేసే శక్తి లేదా...? రాజకీయ వ్యక్తుల ఒత్తిడికి లోనై చర్యలు చేపట్టడం లేదా...? అని ప్రశ్నించారుపలు రాజకీయ పార్టీలు, పలువురు ప్రజాప్రతినిధులు రాజకీయపక్షాల అండ ఉండడంవల్లనే గంజాయి మాదకద్రవ్యాల మాఫియాలు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. రాజకీయ పక్షాలు వారి స్వార్ధ ప్రయోజనాల కోసం యువతని వారి చుట్టూ తిప్పుకోవడానికి మత్తు పదార్థాలకు బానిసలుగా చేస్తున్న పరిస్థితులు అధికమయ్యాయి. నేటి సమాజంలో అవినీతిని , నిరుద్యోగాన్ని, ధరల పెరుగుదలను, అభివృద్ధిని, తప్పును తప్పు అని ప్రశ్నించే యువత తయారు కాకూడదు అన్నది పాలకవర్గాల లక్ష్యంయువతను నిర్వీర్యం చేస్తున్న మద్యం డ్రగ్స్ మత్తు పదార్థాలు గంజాయి ఇతర సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ ఎన్నో పోరాటాలను చైతన్య కార్యక్రమాలను నిర్వహించింది. కొంతమంది యువకులు ముందు యుగం దూతలు - పావన నవజీవన బృందావన నిర్మాతలు అని మహాకవి శ్రీశ్రీ పేర్కొన్నట్లుగా యువశక్తి నీ సంపూర్ణంగా వినియోగించుకునే విధానాలు పాలకులు రూపొందించేందుకు యువతను జాగ్రత్త చేసే,ఉద్యమాలు నిర్మించేందుకు దేశ సార్వభౌమాత్వానికి ముప్పుగా పరిణమించిన రాజ్యాంగ విచ్ఛిన్నానికి పాల్పడుతున్న దుష్టశక్తులను ఎదుర్కొని తరిమికొట్టి సామర్థ్యాన్ని యువత పెంపొందించుకునేందుకు అవసరమయ్యే సమగ్రమైన యువజన విధానాలు కొరకు హక్కుల సాధన కొరకు నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చేయి చేయి కలుపుదాం... కదులుదాం... కదిలిద్దాం....

# అరటి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది.

**● రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రన్న రైతులకు భరోసా,,, ● టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్**



అమరావతి డిసెంబర్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి) రాష్ట్రంలో అరటి రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని సకాలంలో వర్షాలు కురవడం, ఎరువులు రైతులకు అందించటంతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహకాలతో ముందెన్నడూ లేని విధంగా ఈ ఏడాది అరటి ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ తెలిపారు. అమరావతిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అరటి ఉత్పత్తితో ధరలో కొంత మేర వ్యత్యాసం రావడంతో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేలా అనుమతులు తీసుకురావడం జరిగిందని ఆయన తెలిపారు. కడప, అనంతపురం జిల్లాల నుంచి రోజుకు 700కు పైగా మె.ట. అరటి ఎగుమతి చేసేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఇప్పటివరకు 21 వేల మె.ట. ఎగుమతి చేయడం జరిగిందని. ధరలు కూడా టన్నుకు రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెరగడం జరిగిందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి అరటి రైతుల సమస్యను తీసుకువెళ్లడంతోపాటు ప్రత్యేకంగా కంటైనర్లు కేటాయించడంతోపాటు ఎగుమతులకు 50శాతం మేర రాయితీతో అనుమతి ఇవ్వాలని కోరడం జరిగిందని ఆయన అన్నారు. అరటిలో నాణ్యమైన రకానికి మె.ట. రూ.13 వేల నుంచి రూ.14 వేల వరకు ధరలు తగ్గిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఢిల్లీలో అరటి వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తుందని ఆయన తెలిపారు. అనంతపురం కలెక్టర్ అరటి వ్యాపారులతో రెండుసార్లు సమావేశం నిర్వహించి ధర కల్పించేందుకు కృషి చేయడం జరిగిందని, కడప జిల్లా కలెక్టర్ కూడా స్థానిక వ్యాపారులతో మాట్లాడి పంటకు గిట్టుబాటు ధర లభించేలా కృషి చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అక్టోబర్ 1 నుంచి 30 వరకు అరటికి మెట్రిక్ టన్ను ధర రూ.12 వేల నుంచి రూ.14 వేల వరకు లభించడం జరిగిందన్నారు. నవంబర్ 2వ వారం నుంచి ధరల్లో కొంతమేర వ్యత్యాసం ఏర్పడిందని,రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకుని ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. అయిదేళ్లలో ఒక్కసారి కూడా అరటి రైతుల గురించి పట్టించుకోని జగన్ రెడ్డి ఇప్పుడు అరటి రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని పాతర్ల రమేష్ మండిపడ్డారు.

## బుక్ కీపర్ 10,70,000/- దోచేసింది..సారు..!



కోడూరు, డిసెంబర్ 4 (వార్తా ప్రభ) :కోడూరు మండల పరిధిలోని హంసలదీవి గ్రామంలో బుక్ కీపర్ గ్రామ సమైక్య సంఘం లోని పది లక్షల 70 వేలు నిధులు దోచేసిందని డ్వాక్రా మహిళలు ప్రజా దర్బార్లో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కు వినతి అందించారు.గురువారం కోడూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల సత్వర పరిష్కార వేదికలలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కు సమస్యను వివరించారు. ఈ విషయంపై దర్యాప్తు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

## 2026 లో విజయవాడకు నూతన మాస్టర్ ప్లాన్



విజయవాడ పశ్చిమ డిసెంబర్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి) 2026లో విజయవాడకు నూతన మాస్టర్ ప్లాన్ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారని అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలోని పట్టణ ప్రణాళిక విభాగంలో చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్ సూచనల మేరకు అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్ కి పట్టణ ప్రణాళిక శాఖ కార్యకలాపాలపై సమగ్ర వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాస్టర్ ప్లాన్ తయారీ, జోనింగ్ నియమాలు, ద్వారా భవన అనుమతుల ఆన్‌లైన్ ప్రక్రియ, మరియు పథకాల అమలు విధానాల,అధికారులు డిస్ప్లే డివైసెస్ పాలసీ అమలు, ఆక్రమణల తొలగింపు, మాస్టర్ ప్లాన్ రోడ్ల హక్కు-మార్గం పరిరక్షణ, అనధికార నిర్మాణాలపై తీసుకుంటున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను వివరించారు. ప్రస్తుతం విజయవాడకు 2006లో సిద్ధం చేసిన మాస్టర్ ప్లాన్ ఉందని, ప్రతి 20 సంవత్సరాలకు మాస్టర్ ప్లాన్ మారుతుందని, అందులో భాగంగా 2026 లో విజయవాడ నగరపాలక సంస్థ కు నూతనంగా మాస్టర్ ప్లాన్ ప్రణాళికను సిద్ధం చేయబోతున్నారని తెలిపారు. అదనంగా, జంక్షన్ డెవలప్‌మెంట్లు, మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్ ఇంటిగ్రేషన్, కాంటోన్మెంట్ ప్రాంతాల ప్రత్యేక పట్టణ ప్రణాళిక అంశాలపై కూడా వివరణ ఇచ్చి, అమరావతి జోనింగ్ రెగ్యులేషన్ బుక్కును బహూకరించారు.ఈ కార్యక్రమంలో పి.ఆర్. ఒ డాక్టర్ రజియా షబీనా, టీ.పి. ఒ మతిన్, సిబ్బంది పాల్గొన్నారు.

## సి ఆర్ పి ల సమస్యలను పరిష్కరించాలి




విస్సన్నపేట డిసెంబర్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి) ఏపీరాష్ట్ర సిఆర్ పి యూనియన్ పిలుపు మేరకు విద్యాశాఖలో సమగ్ర శిక్ష శాఖ నందు గత 14 సంవత్సరాలుగా సీఆర్ పీలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను తమ సమస్యల పరిష్కారం కొరకు మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణికి వినతిపత్రం అందించారు. తమను రెగ్యులర్ చేయాలి గత ఏడు సంవత్సరాల నుంచి ఎటువంటి శాలరీ పెంపుదల జరగలేదు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ గాని మరణానికి సంబంధించిన బెనిఫిట్స్ గాని ఏమీ లేవు. సుదీర్ఘకాలంగా ప్రభుత్వానికి సేవ చేసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ పై భరోసా ఇవ్వాలని కూటమి ప్రభుత్వంలోనైనా సిఆర్ పి లకు న్యాయం జరుగుతుందని భావించామన్నారు. తమ న్యాయ పరమైన డిమాండ్లను తీర్చి నాలుగు వేల ఉద్యోగ కుటుంబాలకు విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ బాబు తగు న్యాయం చేస్తారని ఎదురుచూస్తున్నామన్నారు.

## జేఎన్‌టీయూ పోటీల్లో గుడ్లవల్లేరు విద్యార్థుల ప్రతిభ...



గుడ్లవల్లేరు: డిసెంబర్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ, కాకినాడ వారు వెలగపూడి సిద్ధార్ధ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్‌లో శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన పురుషులు, మహిళల టీములు తమ ప్రతిభను చాటారు. ఈ విషయాన్ని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్ గురువారం విలేకరులకు తెలిపారు. ఈ చాంపియన్ షిప్‌లో తమ కళాశాల చెందిన మహిళల టీము ద్వితీయ స్థానం, పురుషుల టీము తతీయ స్థానం సాధించారన్నారు. అదే విధంగా యూనివర్సిటీ వారు నిర్వహించిన యూనివర్సిటీ టీములో పి.హర్షిత లక్ష్మి మూడవ సంవత్సరపు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ) విద్యార్థిని ఎన్ని%వీ%ందన్నారు. ఈ నెల 9వ తేదీ నుండి 11వ తేదీ వరకు గీతం యూనివర్సిటీ, విశాఖపట్నంలో నిర్వహించు దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో తలపడనున్నట్లు చెప్పారు. డి.గంగాధర్ నాలుగవ సంవత్సరపు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థి ఈ నెల 25వ తేదీ నుండి 28వ తేదీ వరకు అమిత్ యూనివర్సిటీ చెన్నైలో జరుగు దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ పోటీలలో పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపాల్ డా.బుర్రా కరుణ కుమార్ తెలియజేశారు. ఈ బహుమతులు పొందిన విద్యార్థినీ విద్యార్థులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ అధ్యాపకులు మత్తి శివశంకర్, డి.పూజిత, ఎస్.నాగబాబును కళాశాల ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వరరావు వల్లూరుపల్లి, సెక్రటరీ %-% కరస్పాండెంట్ సత్యనారాయణరావు వల్లూరుపల్లి, కో సెక్రటరీ %-% కరస్పాండెంట్ రామకష్ణ వల్లూరుపల్లి, కళాశాల ప్రిన్సిపాల్ కరుణకుమార్, డైరెక్టర్ డాక్టర్ పి.సిద్ధయ్య, యాజమాన్య సలహాదారు డాక్టర్ పి.రవీంద్ర బాబు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కోదండ రామారావు, డాక్టర్ ఎం.ఆర్.సి.హెచ్.శాస్త్రి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినదించారు.

# తెలుగు చదువుకుంటేనే ఉద్యోగం

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- కృష్ణాతరంగ్ - 2025 ప్రారంభం
- ఉత్సాహంగా పాల్గొన్న యువత.





**మచిలీపట్నం డిసెంబర్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తెలుగు భాషను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రభుత్వాలు తెలుగు చదువుకుంటేనే ఉద్యోగం అనే నిబంధన తీసుకురావాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. గురువారం కృష్ణా విశ్వవిద్యాలయం లో కృష్ణా తరంగ్ 2025 ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భముగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ తెలుగు భాష, చరిత్ర పట్ల ఆసక్తి ఉన్న వారు అరుదుగా కనిపిస్తున్న పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరిపేలా చర్యలు తీసుకోవాలి అని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు కళలు, ఆటల్లో కూడా ప్రావీణ్యం సంపాదించుకోవాలన్నారు. మన దేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ గా అవతరించబోతున్న దశలో దేశంలో ఇంకా బ్రిటిష్ వాళ్ళ ఆనవాళ్లు కనిపిస్తుండటం మంచిది కాదన్నారు. రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ యువత లో దాగివున్న ప్రతిభను వెలికితీయడానికి బందరులో యువకేరటాలు కార్యక్రమం చేపట్టగా నలభై వేలు మంది పాల్గొనడం జరిగిందన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం క్రమం తప్పకుండా కృష్ణాతరంగ్ నిర్వహించడం అభినందనీయమన్నారు. అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మచిలీపట్నం కళల కు పుట్టినిల్లు లాంటిదన్నారు. స్వాతంత్ర్య సమరయోధులకు, పాత్రికేయులకు, ఉత్తమ రాజకీయవేత్తలకు పేరుగాంచిన కృష్ణా జిల్లాలో కృష్ణా విశ్వవిద్యాలయం ఏర్పాటులో తన పాత్ర ఉండటం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు మందలో ఒకరిగా కాకుండా వంద లో ఒకరిగా ఉండాలన్నారు. ఆర్ టి సి చైర్మన్ కొనకళ్ళ నారాయణ మాట్లాడుతూ1970 సంవత్సరం నుండి వెంకయ్య నాయుడు తో పరిచయం ఉందని, కార్యకర్త స్థాయి నుండి ఉపరాష్ట్రపతి వరకు ఎదిగిన ఆయనను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని ఎదగాలన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ అధ్యక్షోపన్యాసం చేస్తూ జాతీయ యువజనోత్సవాల్లో కృష్ణా విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల ల విద్యార్థులు ప్రతిభ చేస్తున్నారన్నారు. భారతదేశాన్ని వేదికగా చేసుకుని ప్రపంచ దేశాలు ఉద్యోగ ఎంపికలు చేసుకుంటున్న దశలో యువత అన్ని రంగాల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, కృష్ణా తరంగ్ 2025 కన్వీనర్ ఆచార్య దిలీప్ తదితరులు ప్రసంగించారు. తొలుత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఎన్ సి సి విద్యార్థుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. తదుపరి బెలూన్లు ఎగురవేసి కృష్ణా తరంగ్ 2025 ను లాంఛనంగా ప్రారంభించారు. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పలు కళాశాల ల నుండి పెద్ద సంఖ్యలో వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలికలు క్రీడలలో రాణించాలి

### చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు



**ఇబ్రహీంపట్నం డిసెంబర్ 04 (వార్తా ప్రభ ప్రతినిధి):** బాలికలు చదువుతోపాటు క్రీడలను కూడా రాణించాలని తెలిపారు కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు. గురువారం నాడు కొండపల్లి బాలికల బాలికోన్నత పాఠశాలలో వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని సందర్శించారు చైర్మన్. ఈ సందర్భంగా బాలికలతో కలిసి వాలీబాల్ ఆడి ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికలు చదువుతో చదువులో ఎప్పుడు ప్రతిభ కనబరిస్తారని, ఆటల్లో కూడా ప్రతిభ కనిపించి పురుషులతో సమానంగా పథకాలు సాధించాలని అన్నారు.రాష్ట్రస్థాయి పోటీలలో విజయం సాధించి నియోజకవర్గానికి కొండపల్లి మున్సిపాలిటీకి పేరు తేవాలని తెలిపారు. ఆటలు శారీరక మానసిక దృఢత్వానికి ఎంతో దోహదపడతాయని ప్రతి ఒక్కరూ ఆటోలో చురుగ్గా పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కొండపల్లి అధ్యక్షులు చెరుకుమల్లి సురేష్, కర్మికొండ బాలాజీ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బసవ ఉమామహేశ్వరరావు కొత్తపల్లి ప్రకాష్, మిక్కిలి విజయ్ కుమార్, , కుమ్మరి శ్రీను, వేమూరి అజయ్, డొక్కుమల్ల సుదీర్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు హేమలత పాల్గొన్నారు.

## తెలుగు సినిమా సంగీతానికి కేరాఫ్ అడ్రస్ ఘంటసాల.

### ఘనంగా ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి.



**మచిలీపట్నం డిసెంబర్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు తెలుగు సినిమా సంగీతానికి ఆజరామరమైన సేవలను అందించిన గాయకులు, సంగీత దర్శకులు, ఘంటసాల గా త్రం లో ఉన్న మాధుర్యం, పాండిత్యం, భావ వ్యక్తీకరణ స్వర్గీయ ఘంటసాలను అపూర్వ గాయకుడిగా నిలబెట్టాయి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా మచిలీపట్నం నగరం మెయిన్ రోడ్ మున్సిపల్ పార్క్ ప్రక్కన ఉన్న ఆ మహనీయుని కాంస్య విగ్రహానికి గురువారం పలువురు ప్రముఖులు, ఆయన అభిమానులు పూలమాలలు వేసి, ఆ మహనీయుని పాటలను గుర్తు చేసుకుని ఘనమైన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి పలువురు వక్తలు మాట్లాడుతూ భగవద్గీత ఆలాపన ఘంటసాల స్వరములో నేటికీ అసమానంగా భావించబడుతుంది అన్నారు. స్వర్గీయ ఘంటసాల సంగీత దర్శకుడిగా కూడా అనేక చిత్రాలకు పని చేశారు అన్నారు. నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు వంటి ప్రముఖ నటుల చిత్రాలలో ఘంటసాల స్వరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది అన్నారు. భగవద్గీత, పురాణాలు, శ్లోకాలు, భక్తి గీతాలు, జానపద గీతాలు, దేశభక్తి పాటలు అన్నింటికీ స్వర్గీయ ఘంటసాల స్వరం అద్భుతంగా సరిపోయేది అన్నారు. ఘంటసాల ను గాన గాంధర్వుడు అని ప్రజలు ముద్దుగా పిలుస్తారు అన్నారు. ఘంటసాల పాటలు తెలుగు సంస్కృతిలో విడదీయరాని భాగమైపోయాయి. ఆయన స్వరం నేటికీ కొత్త తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉంది. భావానుభూతి, శృతి, లయ అన్నింటిని సమపాళ్లలో కలిపిన గాన మూర్తులు స్వర్గీయ మన ఘంటసాల వెంకటేశ్వరరావు అన్నారు. అలాంటి గొప్ప మహనీయుని జయంతి సందర్భంగా నివాళులర్పించడం మనందరి కర్తవ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్, తెలుగుదేశం పార్టీ తెలుగు రైతు కృష్ణా జిల్లా అధ్యక్షుడు, గోపు సత్యనారాయణ, వేణుగోపాలస్వామి దేవస్థానం చైర్మన్, ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్, సురిసెట్టి హరికృష్ణ, సురేష్ తదితర ఘంటసాల అభిమానులు పాల్గొన్నారు.

## జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

### షేక్ మొహమ్మద్ ఫైజాన్



**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 04(వార్తా ప్రభ ప్రతినిధి):** పులివెందుల శాసనసభ్యుడు జగన్మోహన్ రెడ్డి మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఉద్దేశించి మాట్లాడిన మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని అన్నారు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ మహ్మద్ ఫైజాన్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు గాడిదలు కాస్తున్నారా అందుకేనా మీకు ముఖ్యమంత్రి పదవి ఇచ్చింది అని మాట్లాడటం మీ స్థాయిని గాడిదలు కాసే స్థాయికి దిగజారి పోయాడని మండిపడ్డారు. ఆయన వ్యాఖ్యలతో ఆంధ్ర రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారు అని..రెండు మూడు నెలలకు ఒకసారి నాలుగు గోడల మధ్య కూర్చొని ప్రెస్ మీట్ లు పెట్టి ఉనికి కోసం ఏదో ఒకటి మాట్లాడటం మాజీ ముఖ్యమంత్రిగా అలవాటైపోయిందని అన్నారు. టిటిడి దేవస్థానంలో జరిగినటువంటి చోరీ అది చాలా చిన్నదని 72000 వేలే అని అది పెద్ద తప్పు కాదని మాట్లాడటం చూస్తుంటే ఇటువంటి వ్యక్తికే నా మనం 2019లో ఓట్లు వేసి గెలిపించి ముఖ్యమంత్రిని చేసింది అని ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నారా చంద్రబాబునాయుడు తప్పు చేసిన ఎటువంటి వారు ఎవరైనా సరే సాక్షాధార ఉంటే తప్పక శిక్షిస్తామని చంద్రబాబునాయుడు చెప్పారని ఆ మాట గుర్తుంచుకోవాలని సూచించారు.

## నేడు చేజర్ల కు దేవదాయ శాఖ మంత్రి ఆనం రాక

### చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ డే లో పాల్గొననున్న మంత్రి ఆనం



**చేజర్ల డిసెంబర్ 04 (వార్తాప్రభ)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ 3.0 శుక్రవారం మండలంలోని అన్ని పాఠశాలల్లో జరగనుందని చేజర్ల మండల విద్యాశాఖదికారులు జి.ఇందిర డిసి మస్తానయ్య లు పేర్కొన్నారు. చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరుగనున్న మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ 3.0 కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొంటారని తెలిపారు. విద్యార్థుల హాజరు విద్యార్థుల ప్రగతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును తమ పిల్లలతో కలిసి ప్రతి తల్లి తండ్రి పరిశీలించవచ్చు అన్నారు.

## ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను ప్రోత్సహించాలి



**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 4 (వార్తా ప్రభ ప్రతినిధి):** ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని సమగ్ర శిక్ష సహిత విద్య జీసీడీవో విశ్వ భారతి అన్నారు. గుంటుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఎన్టీఆర్ జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త కె.నారాయణ ఆధ్వర్యంలో గురువారం పారా ఒలింపిక్స్ నిర్వహించారు. ఎంఈవో సిహెచ్.పుష్పలత మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగ విద్యార్థులు కూడా భాగమేనన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు సమగ్ర శిక్ష అధికారులు మంచి అవకాశాలు కల్పిస్తున్నారని చెప్పారు. సహిత విద్యా సమన్వయకర్త నారాయణ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో అన్ని మండలాల నుంచి దాదాపు 100 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. అండర్ – 17, అండర్ – 20 విభాగాల్లో 100, 200, 400, 1500 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్, షాట్ పుట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. డైట్ జిల్లా కో – ఆర్డినేటర్ కె.మోహనరావు, ఎంఈవో – 2 పి.వి.మాలిని, ప్రధానోపాధ్యాయిని ఎం.సంధ్యారాణి, ఫిజికల్ డైరెక్టర్ టి.సురేంద్రబాబు, సిహెచ్.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, చక్రవర్తి, టి.పద్మప్రణీత, సిఆర్ఎంటీ డి.నాగేశ్వరరావు, భవిత సెంటర్ ఉపాధ్యాయులు చంద్రావతి, ఉష తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన టిడిపి రాష్ట్ర నాయకులు కె విజయబాబు



**రెడ్డిగూడెం, డిసెంబర్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రెడ్డిగూడెం (వార్తాప్రభ ప్రతినిధి ):రెడ్డిగూడెం మండలం, రెడ్డిగూడెం గ్రామంలోని మల్లాది సత్యానందం మరియమ్మల ప్రథమ పుత్రుడు మల్లాది తేజ మౌనికవివాహ మహొత్సవంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కె విజయ బాబు , తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు పైడిమర్ల కిరణ్ కుమార్ రెడ్డి స్థానిక సీఎస్ఐ చర్చిలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త జీవితం కొత్త ఆశలు తెస్తుంది, అని మీ ఇద్దరికీ శుభ సంతోషాలతో నిండిన దాంపత్య జీవితం కావాలని కోరుకుంటున్నాము అని అన్నారు. మీ బంధం ప్రేమ, నమ్మకం, ఆనందాలతో ఎల్లప్పుడూ చిరకాలం నిలవాలి. మీ ఇద్దరి జీవితాలు ప్రేమతో ఆనందంతో నిండిపోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ పెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బండపల్లి వందనం,మల్లాది నాగభూషణం, కట్ట భద్రయ్య, చింత్రాల రమేష్, పల్లెపాము రవి, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు పోతురాజు బాలకృష్ణ, పైడిమర్ల సుధాకర్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## పొలంబడి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

### వ్యవసాయ శాఖ ఏ డి ఏ,ఎన్ దైవకుమార్

**కిర్లంపూడి, డిసెంబర్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం వ్యవసాయ శాఖ ఏ డి ఏ, ఎన్ దైవకుమార్ పిలుపునిచ్చారు. గురువారం కిర్లంపూడి మండలం ముకొల్లు గ్రామంలో మండల వ్యవసాయ శాఖ అధికారిని నాగం సుధామాధురి ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏ డి ఏ, ఎన్ దైవకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సీజన్ కాలంలో ప్రభుత్వం 14 వారాలపాటు ఎంతో ప్రతిష్టాత్మకమైన నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది అందిస్తున్న పలు సలహాలు, సూచనలు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడమే కాకుండా, ఆరోగ్యవంతమైన పంటలు పండించాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో పొలంబడి రైతులతో పాటు గ్రామ వ్యవసాయ సహాయకురాలు దేవి ప్రసన్న పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



## ఇంపాక్ట్ సర్టిఫైడ్ స్పీకర్ గా వడ్లమూడి సంధ్య



**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 04(వార్తా ప్రభ ప్రతినిధి):** ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ సర్టిఫైడ్ స్పీకర్ గా వడ్లమూడి సంధ్య ను ఎంపిక చేసినట్లు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ జాతీయ అధ్యక్షులు మారుజ రమేష్, రీజినల్ అధ్యక్షులు గూడ రాము తెలిపారు. సంధ్య స గుంటుపల్లి డాన్ బోస్కో( సీ బీ ఎస్ సీ) స్కూల్ లో తెలుగు టీచర్ గా పని చేస్తున్నారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస సంస్థ ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణలో ఆమె పాల్గొన్నారు. జీవన నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, ఆత్మ విశ్వాసం వంటి అంశాలతో పాటు విద్యార్థుల్లో కేరిర్ గైడెన్స్, యువతలో పర్సనాలిటీ మేనేజ్మెంట్ అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ శిక్షణ వల్ల వృత్తిలో అభివృద్ధి చెందడానికి, వ్యక్తిగత సమస్యలను ఏ విధంగా పరిష్కరం చేసుకోవాలో తెలుసుకున్నామని తెలిపారు. ఈ శిక్షణలో పాల్గొనే అవకాశం కల్పించిన ఇంపాక్ట్ ఫౌండేషన్ కు, నిపుణులు కు, ఫౌండర్ వ్యవ స్థాపకులు గంపా నాగేశ్వరావుకు వడ్లమూడి సంధ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు, ఉపాధ్యాయులు వడ్లమూడి సంధ్యను అభినందించారు.

## నేషనల్ త్రోబాల్ పోటీలకు సెంటెన్స్ స్కూల్ విద్యార్థిని ఎంపిక



**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 04(వార్తా ప్రభ ప్రతినిధి)** నేషనల్ త్రోబాల్ అండర్ 17 పోటీలకు గుంటుపల్లి సెంటెన్స్ (సీబీఎస్సీ) విద్యార్థిని కృషిక ఎంపికైంది. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన ఎంపికలో వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థినులు పాల్గొనగా వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఖుషిక నేషనల్ పోటీగలకు ఎంపికైంది.కేరళలోని జరగబోయే నేషనల్ పోటీలలో ఖుషి గా ఆంధ్రప్రదేశ్ తరపున ఆడనుంది. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ సిస్టర్ జెన్ ఆంటోని ఖుషికను అభినందించారు. అదేవిధంగా స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు సాయికుమార్ ప్రత్యేక శ్రద్ధతో త్రోబాల్ నైపుణ్యత నేర్చుకున్నట్లు కృషిగా తెలిపారు.

## సింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే డిఎన్ఆర్





**కైకలూరు డిసెంబర్ 4 (వార్తా ప్రభ)** ఏలూరు జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు, కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఈరోజు ఉదయం ముదినేపల్లి మండలం,సింగరాయపాలెం గ్రామంలో శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన షష్టి ఉత్సవాల ప్రత్యేక పూజలకు హాజరయ్యారు.ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు ఆలయానికి చేరుకున్న దూలం నాగేశ్వరరావును కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని, గ్రామ ప్రజలందరికీ దేవుని ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ కలుగాలని కోరుతూ ప్రార్థనలు చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## డిడిఓ కార్యాలయం ప్రారంభోత్సవం వీక్షిస్తున్న ప్రజా ప్రతినిధులు





**చేజర్ల డిసెంబర్ 04 (వార్తాప్రభ)** రాష్ట్ర వ్యాప్తంగా డిడిఓ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రారంభిస్తున్న సందర్భంగా చేజర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు గురువారం ఏర్పాటు చేసిన డిడిఓ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని లైవ్ ద్వారా వీక్షించడం జరిగినది. ఇక్కడ ఈ కార్యక్రమాన్ని టీవీలో వచ్చే లైవ్ ద్వారా చేజర్ల మండల ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి మండల సొసైటీ అధ్యక్షులు బి.వీరాఘవరెడ్డి తెలుగుదేశం పార్టీ మండల ఎస్.సి సెల్ నాయకులు సోమవరపు హజరత్ అలాగే మండల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని వీక్షించడం జరిగినది.

## లైఫ్‌లైన్ తులసి ఆసుపత్రిలో విజయవంతమైన
# స్కార్లెస్ థైరాయిడ్ శస్త్రచికిత్స




కాప్రా, డిసెంబర్ 04:(వార్తా ప్రభ) వైద్యరంగంలో హైదరాబాద్ నగరం ప్రపంచంలోనే అత్యధికంగా సర్జరీ, లైఫ్ సైన్సెస్ బయో మెడికల్ రంగంలో అభివృద్ధి సాధించిందని చైర్మన్ చీఫ్ సర్జన్ జె ఎస్ రాజ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ పరిధిలోని ఈసీఐఎల్ లైఫ్ లైన్ తులసి ఆస్పత్రి ఆవరణలో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ జె ఎస్ రాజకుమార్ హాజరై మాట్లాడుతూ, హైదరాబాద్‌లోని లైఫ్‌లైన్ తులసి ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో అరుదైన ట్రాన్స్‌ఓరల్ ఎండోస్కోపిక్ థైరాయిడెక్టమీ %–% వెస్టిబ్యులర్ అప్రోచ్ (టిఓఈటివిఏ) శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. థైరాయిడ్ నాడ్యుల్ సమస్యతో ఆసుపత్రికి వచ్చిన 60 ఏళ్ల వ్యక్తిపై ఈ స్కార్లెస్, మినిమల్ ఇన్వేసివ్ శస్త్రచికిత్స చేయడంతో రోగి ఆరోగ్యంగా కోలుకుంటున్నట్లు ఆసుపత్రి ప్రతినిధులు తెలిపారు. దేశవ్యాప్తంగా కూడా కొన్ని ఆస్పత్రులలో మాత్రమే అందుబాటులో ఉన్న ఈ శస్త్రచికిత్సకు అత్యున్నత శస్త్ర నైపుణ్యం, ప్రత్యేక పరికరాలు, బలమైన క్రిటికల్‌కేర్ అవసరమని వైద్యులు తెలిపారు. దక్షిణ భారతదేశంలోని హైదరాబాద్‌లో టిఓఈటివిఏ నిర్వహించగల సామర్థ్యం ఉన్న ఏకైక ఆసుపత్రి లైఫ్‌లైన్ తులసి ఆసుపత్రేనని నిర్వాహకులు పేర్కొన్నారు. శస్త్రచికిత్స అనంతరం రోగికి ఎలాంటి సమస్యలు లేకుండా త్వరితంగా కోలుకుంటుండటం ఆసుపత్రి ఆధునిక వైద్యసేవలకు నిదర్శనమని వైద్య బృందం పేర్కొంది. ఈ శస్త్రచికిత్సలో డా. జె.ఎస్. రాజ్‌కుమార్ (చైర్మన్ %ఙ% చీఫ్ సర్జన్), డా. కల్నల్ కె.ఆర్.రావు, డా. కరుణాకర్, డా. ప్రఫుల్, డా. భార్గవ తదితరులు ఆసుపత్రి సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సిమెంట్ బెంచీల వితరణ.




గన్నవరం డిసెంబర్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి) కృష్ణాజిల్లా గన్నవరం లో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సిమెంట్ బెంచీల వితరణ జడ్పీహెచ్ఎస్ బాయ్స్ గ్రౌండ్ నందు 11 పోలీస్ స్టేషన్ వద్ద 2 సబ్ కోర్టు వద్ద 1 సబ్ రిజిస్టర్ ఆఫీస్ వద్ద 1 గాయత్రి గుడి ప్రాంగణం వద్ద 1 స్పందన వికలాంగుల స్కూలు నందు 2 రైతు బజార్ నందు 2 ఫైర్ ఆఫీస్ నందు 1 రిటైర్డ్ ఎంప్లాయిస్ ఆఫీసు నందు 2 కోర్టు ప్రాంగణం ముందు 1 మొత్తం 23 సిమెంట్ బెంచీలను 1,50,000 విలువ గలిగిన సిమెంట్ బెంచ్ లు ఒక్కొక్క సిమెంట్ నుంచి 6500 రూపాయలు, దాతల సహాయంతో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడమైనది దాతలు మదుపల్లి బాలకృష్ణమూర్తి, కర్ర వరప్రసాద్, వీసం ప్రసాదరావు, పువ్వల ఆదినారాయణ, కనకాల వెంకటేశ్వరరావు, ముక్కామల సుబ్బారావు, గన్నె వెంకటరావు, సయ్యద్ లాల్, వివి కృష్ణమోహన్, పొట్లూరి రామకృష్ణారావు, విశ్రాంత ఉపాధ్యాయులు సాంబశివ రెడ్డి, ఈ కార్యక్రమం ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ముఖ్యంగా వృద్ధులు, ప్రజలు సేద తీరడానికి వీలుగా ఈ బెంచీలను ఏర్పాటు చేసినట్లు సంస్థ సభ్యులు తెలిపారు. ఈ గొప్ప కార్యక్రమానికి సహకరించిన దాతలందరికీ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ బెంచీల వితరణ కార్యక్రమం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుల పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించబడింది.

# 'ఫీజులుం'

● 'పది' విద్యార్థుల జేబులకు చిల్లు ● దోచేస్తున్న 'కార్పొరేట్', ప్రైవేట్ యాజమాన్యాలు ● పబ్లిక్ పరీక్ష ఫీజు పేరుతో రూ.1800 ల వరకూ వసూళ్లు ● అసలు చెల్లించాల్సింది రూ. 125 మాత్రమే ● ఆందోళనల్లో విద్యార్థుల తల్లిదండ్రులు ● పట్టించుకోని విద్యాశాఖ ఉన్నతాధికారులు

మైలవరం/జి.కొండూరు డిసెంబర్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పదో తరగతి విద్యార్థులను దోచేస్తున్నాయి. ఫైనల్ పరీక్షల ఫీజులను ఇష్టమొచ్చినట్లు వసూళ్లు చేస్తూ అడ్డగోలు దోపిడీకి తెరలేపాయి. ఒకొక్క విద్యార్థి నుంచి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.125 మాత్రమే వసూళ్లు చేయాలి. గడువు తేదీ ముగియడంతో అదనపు ఫీజు చెల్లించాల్సి ఉంది.రెగ్యులర్ విద్యార్థులు, ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు, ఒకేషనల్ విద్యార్థులు ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఈనెల 13 నుంచి 25 వరకు ఫీజు చెల్లించవచ్చు. ఆ తర్వాత రూ.50 ఆలస్య రుసుముతో డిసెంబరు 3 వరకు, రూ.200 ఆలస్య రుసుము తో డిసెంబరు 10 వరకు,రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబరు 15 వరకు పరీక్ష ఫీజు చెల్లించడానికి అవకాశం ఉంది.రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125లు, ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు, 3 కంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, మూడు సబ్జెక్టుల వరకు రూ.110, వృత్తి విద్యా విద్యార్థులు అదనం గా రూ.60లు, వయసు నిర్ధారణ రుసుమురూ.300 చెల్లించాల్సి ఉంటుంది.అయితే స్పెషల్ క్లాసులు, స్పెషల్ ఎగ్జామ్స్, పరీక్షలు రాసేవుడు వాహన సదుపాయం అనే పేరుతో కొన్ని యాజామాన్యాలు అడ్డగోలు దోపిడీకి తెరలేపాయి. పదో తరగతి చదివే ఒక్కొక్క విద్యార్థి నుంచి కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు రూ.1500ల నుంచి రూ.2 వేల వరకూ యదేచ్ఛగా వసూళ్లు చేస్తున్నాయి.ఇలా జిల్లా మొత్తంగా చూస్తే కోట్ల రూపాయలను అడ్డ గోలుగా వసూలు చేస్తున్నట్లు సమాచారం.:వచ్చే ఏడాది మార్చి నెలలో జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఫీజుల చెల్లింపు ప్రక్రియ మొదలైంది.ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పరీక్ష ఫీజు రూ.125 చెల్లించాలని విద్యాశాఖ ప్రకటించింది.పాఠశాల యాజమాన్యాలు అదనం గా ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.అయినా, జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫీజు పేరుతో అడ్డగోలు వసూళ్లకు తెరలేపాయి.తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుకు పదోతరగతి తొలిమెట్టు అని భావిస్తారు.అయితే ఆ భావననే అవకాశంగా మార్చుకుని నిర్ణీత ఫీజుల కంటే అదనంగా వసూలు చేస్తున్నారు.ఈ విషయంపై విద్యాశాఖ అధికారుల




దృష్టికి విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకువెళ్లినా ఆయా స్కూళ్లపై చర్యలు తీసుకోవడం లేదని తెలుస్తోంది.పరీక్ష ఫీజు చెల్లించాల్సిన గడువు తేదీ ఈ నెల 25 తేదీతో ముగియనుంది.అదనపు రుసుముతో డిసెంబరు రెండో వారం వరకూ చెల్లించే అవకాశం ఉంది.దాదాపుగా ఇప్పటికే 90 శాతం పైగా వరకు వసూళ్లు జరిగినట్లు తెలుస్తోంది.

**అదనపు వసూళ్లపై అడిగేవారేరీ.....?** ఈ ఏడాది టెన్త్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.వారి తల్లిదండ్రులు పరీక్షల ఫీజు రూ. 125 చెల్లించేందుకు స్కూళ్లకు వెళ్లితే అదనంగా డిమాండ్ చేస్తున్నారు.తాము నిర్ణీత పరీక్ష ఫీజులు మాత్రమే చెల్లిస్తామని చెబితే అధికారులకు ఇచ్చుకోవాల్సి ఉంటుందని ఆయా స్కూళ్ల హెచ్ఎంలు వాదిస్తున్నారు. అడిగిన మేరకు ఇవ్వని తల్లదండ్రుల పిల్లలకు ఏదో ఓ సాకు పెట్టి తోటి విద్యార్థుల ముందు అవమానాలకు గురి చేస్తున్నట్లు సమాచారం.ఈ విషయాన్ని కొంత మంది పేరెంట్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు చూస్తాం...చేస్తామని నిర్లక్ష్యంగా సమాధానాలు ఇచ్చినట్లు చెబుతు న్నారు.

**పరీక్ష ఫీజు రూ.125 మాత్రమే వసూలు చేయాలి:** టెన్త్ పబ్లిక్ పరీక్ష ఫీజు రూ.125 మాత్రమే వసూలు చేయాలని ఉన్నత విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.రూ. 125 కంటే అదనంగా ఎక్కడైనా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ స్పష్టం చేశారు.అదనపు వసూళ్లపై ఎంఈవోలు, డిప్యూటీ డీఈవో, డీఈవో, ఆర్జేడీలకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఫిర్యాదుల ఆధారంగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఇప్పటివరకూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ద్వారా మాత్రమే పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంది.ఈ ఏడాది నుంచి నేరుగా విద్యార్థులే చెల్లించే అవకాశం కల్పించారు. విద్యార్థులు లేదా తల్లిదండ్రులు 'బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్' వెబ్‌సైట్ ద్వారా పరీక్ష ఫీజు చెల్లించవచ్చు.

# మా సమస్యలు పట్టించుకోండి

**ప్రభుత్వానికి ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ నేతల విజ్ఞప్తి**




విజయవాడ, డిసెంబర్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి): ఏపీ గవర్నమెంట్ నర్సస్ అసోసియేషన్ వారు కొత్త గవర్నమెంట్ హాస్పిటల్ ఎస్ఎంసి ఎకడమిక్ హాల్ నందు నిర్వహించడం జరిగినది. ఈ మీటింగ్ కార్యక్రమమునకు 13 జిల్లాల నుంచి ఎన్నికల్లో ఎన్నుకోబడ్డ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.పలు అంశాల మీద సుదీర్ఘ చర్చలు తర్వాత కొన్ని అంశాలు గవర్నమెంట్ ముందు పెట్టాలని నిర్ణయించడం జరిగింది. ఆ అంశాల్లో ముఖ్యంగా పీహెచ్సీ ప్రాబ్లమ్స్ గత నాలుగేళ్లుగా గవర్నమెంట్ లో 143 జీవోను సవరించాలని వెళ్ళిన గవర్నమెంట్



కు ప్రస్తుత గవర్నమెంటు అధికారులకు కూడా పదేపదే రిప్రజెంటేషన్ చేయడము జరుగుతుంది కానీ అధికారుల నుంచి ఎటువంటి సానుకూలమైన సమాధానం రాకపోవడం వలన మరియొక సారి గవర్నమెంట్ కు పీహెచ్సీ ప్రాబ్లమ్స్ అనగా ఇంటీరియర్ ప్లేసెస్ లో పనిచేయుచున్న పిహెచ్సిలు తొమ్మిది నుంచి నాలుగు వరకు మండల హెడ్ క్వార్టర్ లో పనిచేసే పిహెచ్సిలు 24 గంటలు పనిచేసే విధంగా గవర్నమెంట్ వారు చూడాలని గత కొంతకాలంగా పిహెచ్సిలో సెక్యూరిటీ ప్రాబ్లమ్స్ వలన అంటే ఒకే స్టాఫ్ నర్స్ నైట్ ఉండడం వల్ల అటు సెక్యూరిటీ కానీ ఇటు సపోర్టింగ్ స్టాఫ్ కాని లేకపోవడం వల్ల అనేకమంది రోడ్డు పక్కన ఎల్లెవార్లు తలుపులు బద్దలు కొట్టడం వర్షం వచ్చినప్పుడు పాములు రావటము తాగి రోడ్డు ను పోయేవారు గొడవలు పడడం ఇలా అనేక విధాలుగా స్టాఫ్ నర్స్ కు ప్రాబ్లమ్స్ ఎదురవుతున్నాయన్నారు. అంతేకాకుండా ఒక స్టాఫ్ నర్స్ సెలవు తీసుకుంటే మిగతా ఇంకొక స్టాఫ్ నర్స్ 24 గంటలు పని చేయాల్సి వస్తుందనీ, ఒక సెలవు తీసుకోవడానికి కూడా చాలా కష్టతరం అయిపోతుందన్నారు. ఈ ప్రాబ్లంస్ అన్నీ కూడా పదేపదే గవర్నమెంట్ కి విన్నవించుకుంటున్న ఎటువంటి నుంచి రావడం లేదన్నారు. అంతేకాకుండా 2011 నుంచి ఇప్పటివరకు ఒక గవర్నమెంట్ నోటిఫికేషన్ కూడా నర్సస్ కి లేకపోవడం చాలా దారుణంగా మైన పరిస్థితులు కనీసం 100% గ్రాఫ్ శాలరీ అయినా ఇంప్లిమెంటేషన్ చేయాలని కాంట్రాక్టు వాళ్లకు అసోసియేషన్ తరపున విన్నవించుకుంటున్న వారు పేర్కొన్నారు. డిఎంయుల్లో బీహెచ్లో డి ఎఫ్ హెచ్ లో పనిచేసే స్టాఫ్ నర్స్ కు రిస్ట్రక్చర్ పేరుతో స్టాఫ్ నర్స్ తక్కువ చేయడం చేయడం జరిగిందనీ, డాక్టర్స్ ను పెంచారు డిపార్ట్మెంట్స్ పెరిగాయి ఇన్ఫ్రాస్ట్రక్చర్ పెరిగింది కానీ స్టాఫ్ నర్స్ కుదించడం వల్ల ఒక్క స్టాఫ్ నర్స్ 80 మంది పేషెంట్లకు డిస్ట్రిక్ట్ హాస్పిటల్స్ లో పనిచేయవలసి వస్తుందన్నారు. ఇదివరకు మెటర్నిటీ డిపార్ట్మెంట్స్ లో సపరేటు ఒక పదిమంది స్టాఫ్ నర్స్ ను ఇచ్చేవారు వారిని కూడా తీసివేసి ఉన్న స్టాఫ్ తో అటు మెటర్నెట్ డిపార్ట్మెంట్ ఇటు జనరల్ డిపార్ట్మెంట్ చూసుకోవాలని పెద్దలు అయిన అధికారులు చెప్పడం వలన తీవ్ర ఇబ్బందులు స్టాఫ్ నర్స్ ఎదుర్కొంటున్నారన్నారు.. ఈ ప్రాబ్లమ్స్ అన్నీ గమనించి పెద్దలైన హెల్త్ మినిస్టర్, డిప్యూటీ సీఎం, సీఎం కనీస న్యాయం చేయవలసిందిగా గవర్నమెంట్ అసోసియేషన్ తరపున కోరుతున్నట్టు తెలిపారు. ఈ మీటింగ్ లో స్టేట్ ప్రెసిడెంట్ అయిన రాధమ్మ, స్టేట్స్ జనరల్ సెక్రెటరీ కోటమ్మ, ట్రెజరర్ గంగాభవాని, కృష్ణాజిల్లా ప్రెసిడెంట్ క్షమా బేగం ఇంకా 13 జిల్లాల లీడర్స్ అందరూ కూడా పాల్గొని చర్చించడం జరిగినది.

# సి ఆర్ యం టి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి

**-సి ఆర్ పి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు యమ్.కాశి**

**జి.కొండూరు ఎంఈఒ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపిన సి.ఆర్.యం.టి లు**

**తహశీల్దార్, ఎం ఈ ఒ-1 లకు వినతి పత్రం అందజేసిన కాశి**


MRO కి వినతి పత్రం అందజేస్తున్న సి.ఆర్.పి లు




జి.కొండూరు డిసెంబర్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి):క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్స్(సి ఆర్ యం టి) సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సి ఆర్ పి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు యమ్.కాశి డిమాండ్ చేశారు.ఎన్టీఆర్ జిల్లా,జి.కొండూరు మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం ఎదుట స్థానిక సి ఆర్ పి లతో కలిసి గురువారం ప్లకార్డులు చేతపట్టి నిరసన దీక్ష చేపట్టారు.అనంతరం సి ఆర్ పి లతో కలిసి జి.కొండూరు మండల తహశీల్దార్ సి హెచ్. వెంకటేశ్వర్లు,మండల విద్యాశాఖ అధికారి-1 పి.వి.నరసింహారావు లకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సి ఆర్ పి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కాశి మాట్లాడు తూ జిల్లా ఎంపిక కమిటీ ద్వారా రోస్టర్-కమ్-రిజర్వేషన్, మెరిట్ మరియు ఇంటర్వ్యూ పద్ధతిలో 2011వ సంవత్సరములో 4034 స్కూల్ కాంప్లెక్స్ లలో సి ఆర్ పి. లుగా ఎంపిక కాబటి 14 సంవత్సరాలుగా పాఠశాల విద్యాశాఖ సమగ్రశిక్షలో పనిచేస్తున్నామని తెలిపారు.అయిన నేటికీ సి ఆర్ యం టి ల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయని తెలిపారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్కూల్ కాంప్లెక్సులను ఎ మరియు బి క్లస్టర్ ప్రతిపాదిత విధానాన్ని విరమించాలని, 2016లో పిఎబి అమోదించిన వేతనాలను చెల్లిస్తున్నందున పెరిగిన ధరలకు అనుగుణంగా క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్స్(సి ఆర్ యం టి) అర్హతల ఆధారంగా వేతనాలను పెంచాలని,ఎంటిఎస్ అమలు చేయాలని, డి.యస్.సి లో వెయిటేజి ఇవ్వాలని, ట్రావెలింగ్ అలవెన్సు పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కొన్ని జిల్లాలో ఖాళీగా ఉన్న సి ఆర్ యం టి పోస్టులలో 50-100 కిలో మీటర్ల దూరం ఉన్న వారిని మ్యాపింగ్ చేసే ప్రక్రియను విరమించి ఖాళీగా ఉన్న పోస్టులకు నూతన నియమాకాలు చేసి,సి ఆర్ యం టి లపై అధనపు పని భారాన్ని తగ్గించాలన్నారు. 9 ఏళ్లుగా ఏవిధమైన వేతన పెంపుదల లేకుండా 2016 సంవత్సరంలో పిఎబి ఆమోదించిన రూ. 23,500 లనే వేతనాలుగా చెల్లిస్తున్నారని తెలిపారు.అధిక ధరలతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు.జివో ఎంఎస్ నెం 65 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం సృష్టించిన 4034 సి ఆర్ యం టి లు స్కూల్ అసిస్టెంట్ అర్హతలతో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ బేసిక్ వేతనం రూ. 44,570 లతో రాష్ట్ర పిఆర్‌సి ని అనుసరించి యంటిఎస్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.సి ఆర్ యం టి . లను విద్యాశాఖలో విలీనం చేసి, రెగ్యులర్ చేయాలని, వీరంతా ఫీల్డు లెవల్లో పనిచేస్తున్నందున ట్రావెలింగ్ అలవెన్సును పునరుద్ధరించాలన్నారు.ఫేషియల్ అటెండెన్సు సి ఆర్ యం టి ల పరిధిలోని అన్ని పాఠశాలలో వేసే విధంగా అవకాశం కల్పించాలని, రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని,రిటైరు అయినవారికి గ్రాట్యూటీ, ఇతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ వర్తింప చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఇతర ఉద్యోగులకు వర్తించే పిఎఫ్ మరియు ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు.సి ఆర్ యం టి ల న్యాయమైన డిమాండులను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల డిసెంబరు 8వ తేదీన జిల్లా కలెక్టరేట్ల వద్ద మరియు డిసెంబరు 22వ తేదీన విజయవాడ నందు ఆత్మగౌరవ దీక్ష చేయాలని ఏపి సి ఆర్ ఎం టీచర్స్ యునైటెడ్ ఫోరం ద్వారా తెలియజేయ నున్నట్లు కాశి వెల్లడించారు.



## గ్యాస్ వాడకం పై ప్రమాదల నివారణ పై అవగహన...




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిసెంబర్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి) కొత్తగూడెం పట్టణం లోని మేదర బస్తీ లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు వంట గ్యాస్ వాడకం పై తాగు జాగ్రత్త ల పై అవగాహన కల్పించిన కొత్తగూడెం సివిల్ సప్లై మేనేజర్ ఎం ఏ ఆలివ్ అనంతరం ఆయన మాట్లాడుతూ ఏమైనా అనుకోని ప్రమాదాలు జరిగితే పాటించాల్సిన చర్యలను నివృత్తి చేశారు.గ్యాస్ వాడే టప్పుడు గ్యాస్ లీక్ జ్ అయినా వెంటనే 1906 నెంబర్ కి డైల్ చేయాలని అన్నారు డైల్ చేస్తే మీ గ్యాస్ డీలర్ యొక్క మెకానిక్ వచ్చి మీ యొక్క సమస్యని పరిష్కరిస్తారని.మీ వంట గ్యాస్ కి వాడే సురక్ష రబ్బర్ ట్యూబ్ నీ ప్రతి ఒక్క వినియోగదారుడు 5 సంవత్సరాల ఒకసారి మార్చాలని ప్రమాదం నుండీ బయట పడవచ్చుని తెలిపారు. సురక్ష రబ్బర్ ట్యూబ్ మీ యొక్క డీలర్ వద్దనే తీసుకోవాలని తెలిపారు.విద్యార్థులకు గ్యాస్ వాడకం పై సందేహాలను అడిగి తెలుసుకొని వాటిని అర్థమయ్యేలా విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం మెకానిక్ పాల్గొన్నారు

## పార్టీ కోసం పనిచేసిన వారికీ నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలి

**సీనియర్ నాయకులు చిరుమర్తి రాజు**



కూకట్ పల్లి, డిసెంబర్ 04,(వార్తా ప్రభ):కష్ట కాలంలో పార్టీ ని నమ్ముకొని, పార్టీ కోసం పనిచేసిన వారికీ నామినేటెడ్ పదవులలో సమూచిత స్థానం కల్పించాలని కోరుతూ టిపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన క్రమంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటికి పార్టీ మళ్ళీ పుంజుకొని తెలంగాణ లో అధికారం లోకి రావడానికి తాను 16 సంవత్సరాల నుండి పార్టీ కోసం కృషి చేస్తూ పార్టీనీ నమ్ముకొని ఉన్నానని అన్నారు. 2009 నుండి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతు పార్టీ చేపట్టిన అన్ని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఎన్ని ఒడిదుడుకులు వచ్చిన, బెదిరింపులు వచ్చిన భయపడలేదని పార్టీ కోసం పనిచేస్తున్న తనను గుర్తించి నామినేటెడ్ పదవి ఇవ్వాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు (టీపీసీసీ) ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి తన బయోడేటాను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర సీనియర్ నాయకులు చిరుమర్తి రాజు అందచేశారు

## త్వరలో అందుబాటులోకి మరో ఏడు కొత్త ఇసుక రీచ్‌లు!

- ప్రస్తుతం 9 రీచ్‌లలో 7.27 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక
- అత్యంత పారదర్శకంగా ఇసుక విధానం అమలు
- ఉల్లంఘనలు జరక్కుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




విజయవాడ, డిసెంబర్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)జిల్లాలో అత్యంత పారదర్శకంగా ఇసుక విధానాన్ని అమలు చేయడం జరుగుతోందని.. ఇకపైనా ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇసుక సరఫరా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, త్వరలో ఏడు కొత్త రీచ్‌లను అందుబాటులోకి తెచ్చేందుకు కృషిచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.గురువారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయం నుంచి 6వ జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం వర్చువల్‌గా జరిగింది. ఈ సమావేశంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఇసుక, పట్టా భూముల్లో ఇసుక తొలగింపు, కొత్త రీచ్‌లకు సంబంధించి అనుమతుల ప్రక్రియ, తెలంగాణకు ఇసుక అక్రమ రవాణా కాకుండా తీసుకుంటున్న చర్యలు తదితరాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రస్తుతం తొమ్మిది రీచ్‌ల పరిధిలో 7.27 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. కృష్ణా, మున్నేరు పరిధిలో జగ్గయ్యపేట మండలంలో రెండు, చందర్లపాడు మండలంలో రెండు, కంచికచెర్ల మండలంలో 3 కొత్త రీచ్‌లకు సంబంధించిన ప్రక్రియ చివరి దశలో ఉందన్నారు. పట్టా భూముల్లో మేట వేసిన ఇసుక తొలగింపునకు 34 దరఖాస్తులు వచ్చాయని.. వీటిలో 26 దరఖాస్తులను కమిటీ ఆమోదించినట్లు తెలిపారు. రెండు దరఖాస్తులకు ఇప్పటికే పర్యావరణ అనుమతులు వచ్చాయని.. త్వరలో నోటిఫికేషన్ ఇవ్వనున్నామన్నారు. తెలంగాణకు ఇసుక అక్రమ రవాణా కాకుండా పోలీసు శాఖ సహకారంతో పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని.. అక్రమ రవాణాకు సంబంధించి 248 కేసుల నమోదుతో పాటు 440 మందిని అరెస్టు చేసినట్లు అధికారులు కమిటీకి వివరించారు. జిల్లాలో ఇసుక విధానం అమలుకు సంబంధించి ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల సంతృప్తి స్థాయి బాగుందని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, మైన్స్ డీడీ శ్రీనివాసరావు, సమన్వయ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# దూరవిద్యను దగ్గర చేసింది రామిరెడ్డి

● ఘనంగా రామిరెడ్డి జయంతి వేడుకలు



అమరావతి,డిసెంబర్ 4 (వార్తాప్రభ) : ఉన్నత చదువులు దూరవిద్య రూపంలో ప్రజలందరికీ దరి చేర్చిన ఘనత ప్రొఫెసర్ జి రామ్ రెడ్డి దేనని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కే మధుమూర్తి పేర్కొన్నారు. సామాజిక, ఆర్థిక, మతపరమైన కారణాలవల్ల పెద్ద చదువులకు దూరమైన వారందరూ ఈ విద్యా విధానం ద్వారా ఉన్నత చదువులకు చేరువ అవుతున్నారని ఆయన పేర్కొన్నారు. భారత దేశ దూర విద్యా పితామహుడిగా ప్రొఫెసర్ రామ్ రెడ్డి గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ రామ్ రెడ్డి జయంతి వేడుకలు గురువారం ఉదయం ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ప్రొఫెసర్ రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్ విజయభాస్కరరావు మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ ఎడ్యుకేషన్ ఎస్ యువర్ డోర్ స్టెప్ నినాదంతో దూరవిద్యను దరి చేర్చడం వెనక ప్రొఫెసర్ జి రామ్ రెడ్డి కృషి ఎనలేనిదని అన్నారు. ఆయన వేసిన పునాదులు దూర విద్యలో అనేక విప్లవాత్మకమైన మార్పులకు దోహదం చేశాయని పేర్కొన్నారు. ఈరోజు ఎంతోమంది యువతీ యువకులు కళాశాలలకు విశ్వవిద్యాలయాలకు వెళ్లకుండా ఉన్నత విద్యను ఇంటి దగ్గర ఉండే అభ్యసిస్తూ ఉన్నత పదవులకు వెళుతున్నారంటే దీనికి రామిరెడ్డి చేసిన కృషి కారణమని పేర్కొన్నారు. రామిరెడ్డి చేసిన కృషికి ఎన్నో పురస్కారాలు లభించాయని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రొఫెసర్ రామిరెడ్డిని 1991 లో విశ్వవిద్యాలయాల నిధుల సంఘం(యూ జి సి) చైర్మన్ గా నియమించిందని తెలిపారు. ఉన్నత విద్యలో నాణ్యతను పెంపొందించడానికి నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ స్థాపించిన అంశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. విద్యా రంగానికి చేసిన విశేష కృషికి గుర్తింపుగా ప్రొఫెసర్ రామిరెడ్డిని ఎన్నో పురస్కారాలు వరించిన అంశాన్ని వివరించారు. 1995 జూన్ లో ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్న అంశాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్ విజయ-భాస్కరరావు, వైస్ చైర్ పర్సన్ ప్రొఫెసర్ కె రత్న శీలామణి, సెక్రటరీ ప్రొఫెసర్ బి తిరుపతిరావు, ఓ ఎస్ డి డాక్టర్ వెలగా జోషి, అకాడమిక్ ఆఫీసర్ డాక్టర్ శ్రీరంగం మాథ్యూ,అకడమిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి అనిల్ కుమార్, అకాడమిక్ కన్సల్టెంట్ జి రోశయ్య, చంద్ర విష్ణు మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

# పటిష్ట వ్యవస్థలతోనే అభివృద్ధి పరుగులు

● డీడీవో కార్యాలయాల ద్వారా మరింత అభివృద్ధికి వీలు ● సమన్వయంతో సరైన సేవలందిద్దాం ● వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధనలకు సమష్టిగా కృషిచేద్దాం ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య

నందిగామ,డిసెంబర్ 4 (వార్తాప్రభ) : వ్యవస్థలు ఎంత బలంగా ఉంటే అభివృద్ధి అంత బాగా పరుగులు తీస్తుందని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి (డీడీవో) కార్యాలయాల ద్వారా మరింత ప్రగతికి వీలుంటుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 77 డీడీవో కార్యాలయాలను వర్చువల్ పద్ధతిలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్తూరు నుంచి గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా నందిగామ మండలం, ఐతవరంలో జరిగిన డీడీవో కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ హోంమంత్రివర్యులు వసంత నాగేశ్వరరావుతో పాటు కలెక్టర్ లక్ష్మీశ, శాసనసభ్యులు తంగిరాల సౌమ్య, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నందిగామ డివిజన్ డీడీవో జి.జ్యోతికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాలు ప్రారంభం కావడం శుభ పరిణామమని.. కీలక ప్రగతి సూచికల్లో అభివృద్ధికి, తలసరి ఆదాయం పెరుగుదలకు అన్ని శాఖల అధికారులు కృషిచేస్తున్నారని.. వీటికి సంబంధించి నిరంతర పర్యవేక్షణ



ఉంటోందన్నారు. నియోజకవర్గాల స్థాయిలో విజన్ యూనిట్లు కూడా పనిచేస్తున్నాయని.. అభివృద్ధికి సంబంధించి అన్ని అంశాల్లోనూ పురోగతికి ప్రజాప్రతినిధులతో కలిసి కృషిచేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, డీపీవో పి.లావణ్య కుమారి, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, డ్వామా పీడీ ఎ.రాము, పంచాయతీరాజ్ ఎస్ఈ బాపిరెడ్డి, డీఈ రమేష్, డ్వామా ఏపీడీ లక్ష్మీకుమారి, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ని దర్శించుకున్న నూతన కార్యనిర్వాహణాధికారి మహేశ్వర్ రెడ్డి

ఆలయ బాధ్యతల స్వీకారం





పెనుగంచిప్రోలు,డిసెంబర్ 4 (వార్తాప్రభ) : పెనుగంచిప్రోలు లో వేంచేసి వున్న శ్రీ తిరుపతమ్మ అమ్మ వారిని గురువారం దర్శించుకొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల, ఆలయ పూజారుల ఆశీర్వచనం తీసుకోని అనంతరం నూతన కార్యనిర్వహణాధికారి గా మరియు డిప్యూటీ కమిషనర్ గా బాధ్యతలు బి. మహేశ్వర్ రెడ్డి చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈ ఈ.డి రమా, ఆలయ ఏ ఈ ఓ. జంగం శ్రీనివాసరరావు, ఆలయ ప్రధాన అర్చకులు మర్రే బోయిన గోపి బాబు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..గతం లో పని చేసిన ఆలయ ఈ ఓ కిశోర్ కుమార్ భక్తులకు సరిఅయినా సేవలు చేయడం లేదని పలు ఆరోపణల కు గురి కావడం తో దేవాదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ ఇతనికి పోస్టింగ్ కూడ ఇవ్వకుండా నిలిపివేశారు, కూటమి ప్రభుత్వం ఆదేశాలు తో దేవాదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ వెంటనే శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ఆలయం కు నూతన కార్యనిర్వాహనాధికారిగా మరియు డిప్యూటీ కమిషనర్ గా బి మహేశ్వర్ రెడ్డి ని నియమించగా గురువారం బాధ్యత లు చేపట్టిన్నారు..

## శ్రీ తిరుపతమ్మ దేవాలయం రాష్టం లో ఆఖరి స్థానం..

–సమీక్షలో సీఎం చంద్రబాబు ఆగ్రహం.....



పెనుగంచిప్రోలు,డిసెంబర్ 4 (వార్తాప్రభ) : పెనుగంచిప్రోలులోని శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ ఆలయంలో అందిస్తున్న సేవలపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయ సేవలు, దర్శనాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, మూలిక వసతుల్లో కేవలం 70% ర్యాంక్ రావడంతో ఆయన అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర విభాగాల్లో 90%పైగా ర్యాంకులు వస్తుంటే, ఆలయ అభివృద్ధిలో ఇంత తక్కువగా రావడాన్ని ఆలయ అధికారుల వైఫల్యంగా సీఎం పేర్కొన్నారు. దీనిపై పెనుగంచిపోలు ఈవో తొలగింపుకు సిఎస్ ఆదేశం, గురువారం నుంచి మూడు నెలల పాటు సెలవు పెట్టి వెళుతున్న కార్యనిర్వహణాధికారి, ఎక్కడ పోస్టింగ్ కూడా లేదంటూ వాదనలు వినిపిస్తున్నాయి, దీనిపై ఈరోజు దేవదాయ శాఖ కమిషనర్ శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానానికి నూతన కార్యానిర్వ్హనాధికారిగా బి మహేశ్వర్ రెడ్డిని నియమించారు..

## ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా దర్బార్



కోడూరు,డిసెంబర్ 4 (వార్తాప్రభ) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం కోడూరులో ప్రజా దర్బార్ నిర్వహించారు. కోడూరు మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి ప్రజలు తమ వ్యక్తిగత, గ్రామ సమస్యలపై 57 అర్జీలు సమర్పించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు ఆయా అర్జీలు పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో చర్చించి పరిష్కారాలు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాప్రవీణ్, ఇంచార్జి తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, డీఈఈలు ఎం.రమేష్, పగడాల సురేష్, ఏఈఈలు, వివిధ శాఖల అధికారులు, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గజ వాహనంలో విహరించిన దేవదేవుడు

–నేడు డోకిపర్రు మహాక్షేత్రంలో శ్రీనివాస కళ్యాణం



విజయవాడ,డిసెంబర్ 4 (వార్తాప్రభ) : డోకిపర్రు మహాక్షేత్రంలో వేంచేసి ఉన్న దేవదేవుడు శ్రీ వెంకటేశ్వర స్వామి మంగళవారం నాడు గజ వాహనంపై విహరించారు. డోకిపర్రు మహాక్షేత్రం దశమ బ్రహ్మోత్సవాలు గురువారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. మూడో రోజున ఉదయాన్నే సుప్రభాత, తోమాల సేవ, అర్చన కైంకర్యాల అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీదేవి, భూదేవి సహితంగా గజ వాహనంలో డోకిపర్రు గ్రామంలో విహరించి గ్రామస్తులు, భక్తుల నుంచి పూజలు అందుకున్నారు. గజ వాహనం మీద విహరించిన వేంకటేశ్వరుడిని దర్శించుకుని తరిస్తే మోక్షం కలుగుతుందని వేదపండితులు వివరించారు. అంతకు ముందు పాలు, నెయ్యి, తేనే తదితర సుగంధ ద్రవ్యాలతో శ్రీ వేంకటేశ్వరునికి అభిషేకం నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వరుని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని తరించారు. తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం దేవదేవుడు డోకిపర్రు గ్రామంలో రథంలో ఊరేగారు. రథోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాలుపంచుకున్నారు. అనంతరం గరుడోత్సవం జరిగింది. . మూడో రోజు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పీ వీకృష్ణారెడ్డి, సుధారెడ్డి పర్యవేక్షణలో జరిగిన పూజాదికాల్లో నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ-భాస్కరమ్మ, పీ నాగిరెడ్డి, ప్రసన్న, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం డోకిపర్రు మహాక్షేత్రంలో విశేష శ్రీ శ్రీనివాస కళ్యాణం, చూర్ణోత్సవం, వసంతోత్సవం, దోపు ఉత్సవం, ధ్వజ అవరోహణ, చంద్ర ప్రభ వాహన ఉత్సవం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

# ఆంధ్రలో 2024 లో గణనీయముగా పెరిగిన విదేశీ మరియు దేశీ పర్యాటకులు,ఎంపీ సానా సతీష్ బాబు ప్రశ్నల కు కేంద్రం సమాధానం..



కాకినాడ,డిసెంబర్ 4 (వార్తాప్రభ) : ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగం గణనీయమైన వృద్ధిని సాధించిందని రాజ్యసభలో ఎంపీ శ్రీ సానా సతీష్ బాబు అడిగిన ప్రశ్నకు కేంద్ర పర్యాటక మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ శేఖావత్ ఇచ్చిన సమాధానంలో తెలియపరిచారు, రాష్ట్రంలో దేశీయ పర్యాటకుల సందర్శనలు 2020లో కేవలం 7.08 కోట్ల ఉంటే 2024లో అది 29.02 కోట్లకు పెరిగినట్లు వెల్లడించారు. విదేశీ పర్యాటకుల సంఖ్య కూడా కోవిడ్ ప్రభావం తర్వాత తిరిగి పెరుగుతూ, 2020లో 67,591 నుండి 2024లో 2.62 లక్షలకు చేరినట్లు తెలిపారు. ఈ వృద్ధికి 'దేఖో అప్నా దేశ్' కార్యక్రమం, ఉత్సవ్ పోర్టల్ ద్వారా ప్రాచీన కళలు, సంగీతం, వంటకాలు, వస్త్ర కళలను ప్రోత్సహించే సంస్కృతిక కార్యక్రమాలు, కూటమి ప్రభుత్వ చొరవ దోహదం చేశాయని పేర్కొన్నారు. అలాగే యూత్ హాస్టల్స్ గురించి అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర యు వజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రి డా. మాన్సుఖ్ మాండవీయ సమాధానమిచ్చారు. రాష్ట్రంలో కడప, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం యూత్ హాస్టల్స్ మాత్రమే ప్రస్తుతం పనిచేస్తున్నా యని, విజయవాడ యూత్ హాస్టల్ నిర్వీర్యంగా ఉందని మంత్రి తెలిపారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో కొత్త యూత్ హాస్టల్స్ నిర్మించలేదని స్పష్టం చేశారు. వసతి సామర్థ్యం పెంపు లేదా ఆధునీకరణకు సంబంధించి హాస్టల్ మేనేజర్ మరియు మేనేజ్‌మెంట్ కమిటీ ప్రతిపాదనలు పంపినపుడే కేంద్రం పరిశీలన చేస్తుందని, గత ప్రభుత్వంలో అలాంటి ప్రతిపాదనలు అందలేదని పేర్కొన్నారు.

# కృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు చేతుల మీదుగా బోనస్ చెక్కులు పంపిణీ





హనుమాన్ జంక్షన్, డిసెంబర్ 4 (వార్తాప్రభ) : హనుమాన్ జంక్షన్ క్లస్టర్ పరిధిలోని 2025 - 2026 ఆర్థిక సంవత్సరమునకు గాను రెండవ విడత నాలుగు నెలలు యూనియన్ బోనస్ నిమిత్తం 1,58,56,854 రూపాయల బోనస్ చెక్కులను చైర్మన్ శ్రీ చలసాని ఆంజనేయులు చేతులమీదుగా అందజేయడం జరిగింది . హనుమాన్ జంక్షన్ క్లస్టర్ పరిధిలో మొదటి స్థానంలో పల్లేర్లమూడి మరియు రెండవ స్థానంలో పడమర దిగవల్లి, మూడవ స్థానంలో రమణక్కపేట , నాలుగవ స్థానంలో గోగులంపాడు , ఐదవ స్థానంలో సీతారామపురం సంఘములు ఉన్నాయి. తదనంతరం చైర్మన్ శ్రీ చలసాని ఆంజనేయులు సంఘ అధ్యక్షులతొ మాట్లాడుతూ లాభసాటి పశు పోషణకు గాను హెడ్జ్ లూసర్న్ మరియు జ్యూరీ మరియు సూపర్ నేపియర్ వంటి పశుగ్రాసంల గురించి , చాప్ కట్టర్ వాడకం గురించి వివరించడం జరిగింది. లాభసాటి పశుపోషణకు గాను ఖర్చు తగ్గించే విధంగా పప్పు జాతి గడ్డి అయిన హెడ్జ్ లూసర్న్ మరియు జ్యూరీ పశు గ్రాసం వాడకం గురించి, సక్సెస్ సెమెన్ (పెయ్యిదూడలుపుట్టే సెమెన్) గురించి వివరించడం జరిగింది. అదేవిధంగా ప్రభుత్వం వారు ప్రతి నియోజకవర్గం కు పది లక్షల వ్యయంతో ఒక పశువుల హాస్టల్ ను ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలపడం ఎంతో హర్షణీయం అని , రాష్ట్రం లో పాడి రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పశు సాంద్రతను పెంచాలని చైర్మన్ శ్రీ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. అలాగే పాడి పరిశ్రమ అభివృద్ధికి ఈ నిర్ణయం తీసుకున్నందుకు గాను ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు కి , ఉప ముఖ్యమంత్రి వర్యులకు మరియు కూటమి ప్రభుత్వం కు హృదయం పూర్వక కృతజ్ఞతలు చైర్మన్ శ్రీ చలసాని ఆంజనేయులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రీ చలసాని ఆంజనేయులు, ఫీడ్ కమిటీ సభ్యులు పిన్నమనేని లక్ష్మీ ప్రసాద్, మేనేజర్ మాగంటి హరిబాబు, వివిధ సంఘ అధ్యక్షులు, వేతన కార్యదర్శిలు, సూపర్ వైజర్ లు తదితరులు పాల్గొన్నారు.

# పెడనలో రోశయ్య నాలుగవ వర్ధంతి



పెడన,డిసెంబర్ 4 (వార్తాప్రభ) : పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి ప్రార్ధన మందిరం కళ్యాణమండపం నందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రివర్యులు కొణిజేటి రోశయ్య నాలుగో వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గౌరవ డాక్టరేట్ అవార్డు గ్రహీత డా. కొల్లూరి సత్యనారాయణ (చిన్న) రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా. కొల్లూరి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో అత్యంత విలువలు నిబద్ధత కలిగిన ఏకైక నాయకుడు కొనిజేటి రోశయ్య అని నేటి యువ రాజకీయ నాయకులు రోశయ్య ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు 2021 వ సంవత్సరంలో పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా తాను పదవీ విరమణ చేసిన సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెడన విచ్చేసి ఆ కార్యక్రమం విజయవంతం అవ్వడానికి ఎంతగానో సహకరించిన రోశయ్య మా గుండెల్లో చిరస్మరణీ యులని డా. కొల్లూరి అన్నారు. ఈ కార్యక్రమంలో పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు కొల్లిపర పూర్ణ ప్రదీప్ గుప్తా సభ్యులు ఉదయగిరి గోపాల్ భవిరిశెట్టి రాఘవరావు కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం 11 సూత్రాల అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ జల్లూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# లాభసాటి వ్యాపారం పాడి పశువుల పెంపకం - డా.యమ్. హనుమంతరావు

● జూపూడి గ్రామంలో లాభసాటి పాడి పశువుల పెంపకంపై రైతులకు ఒక్కరోజు శిక్షణ







ఇబ్రహీంపట్నం (జూపూడి),డిసెంబర్ 4 (వార్తాప్రభ) : వ్యవసాయ వ్యాపారంలో రైతులకు పాడి పశువుల పెంపకం లాభసాటిగా ఉంటుందని ఎన్టీఆర్ జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డా.యమ్.హనుమంతరావు వెల్లడించారు. పాడి రైతులు పది సూత్రాలు నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో గురువారం లాభసాటి పాడి పశువుల పెంపకంపై రైతులకు ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు నందిగామ ఉప సంచాలకులు డా.మోసెస్ వెస్లీ ,నందిగామ సహాయ సంచాలకులు డా.కృష్ణ మూర్తి, ప్రాంతీయ పశువైద్య శాల ఇబ్రహీంపట్నం సహాయ సంచాలకులు డా.టి.శ్రీనివాసరావు, డా.ఎం. మోహన్ కిషోర్ హాజరయ్యారు. ముందుగా డా.యమ్.హనుమంతరావు జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.హనుమంతరావు లాభసాటి పాడి పశువుల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో పశుపోషణ, ఆరోగ్య సంరక్షణ, పాల ఉత్పత్తిని పెంచే పద్ధతుల గురించి రైతులకు వివరించారు. ఈ శిక్షణ తరగతులకు విచ్చేసిన పాడి రైతులు కూడా వారి సందేహాలను నివృతి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డా. శైలు మాధురి,డా.స్వాతి అయ్యప్ప,పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొనారు.

## రోగి చికిత్సకు రూ. 10 వేలు అందించిన వైసీపీ నేత రమణారావు



అమలాపురం,డిసెంబర్ 4 (వార్తాప్రభ) : అమలాపురం. కొమరగిరి పట్నం కొత్త కాలనీ కు చెందిన దివ్యాంగుడు నెల్లి ఏడుకొండలు రోడ్డు ప్రమాదానికి గురై అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా ఏడుకొండలు కుటుంబం పేద కుటుంబం కావడంతో చికిత్స అందించేందుకు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. తాము పడుతున్న ఇబ్బందులను ఏడుకొండలు కుటుంబీకులు అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ వైసిపి నాయకుడు,గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన రమణారావు ఏడుకొండలు చికిత్స నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. బుధవారం ఏడుకొండలు కుటుంబ సభ్యులకు రూ.10వేలు రూపాయలను ను రమణారావు అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన రమణారావు కు ఏడుకొండలు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు సాధనాల శ్రీను, నక్క సంపత్ కుమార్, చింతా సూరిబాబు, నాగవరపు పరశురాముడు ,నేరేడుమిల్లి శ్రీనివాసరావు, గంటా లక్ష్మీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వృత్తికి న్యాయం చేస్తున్నామా? ఆత్మ పరిశీలన చేసుకోండి..

(మొదటిపేజీ తరువాయి)

మాత్రం వేలెత్తి చూపిస్తారని, దీనిని అందరూ గమనించాలని కోరారు. **సేవభావాన్ని కలిగి ఉండాలి..** వైద్య వృత్తిని ఉద్యోగంగానే కాకుండా సేవాభావాన్ని, మానవతావాదంతో చూడాలని మంత్రి విజ్ఞప్తిచేశారు. వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన తీసుకురావడంలో, వైద్యాన్ని అందించడంలో కీలకమైన పీహెచ్సి వైద్యులు క్యాన్సర్-04 స్క్రీనింగ్ బాగా జరిగేలా కృషి చేయాలని కోరారు. క్యాన్సర్ వ్యాధికారణంగా తాను తల్లి, సోదరిని కోల్పోయ్యానని ఆవేదన వ్యక్తంచేశారు. సోదరి కోరిక మేరకు తాను వైద్యుడి కాలేకున్నా వారితో కలిసి పనిచేసే అవకాశం కలిగిందని భావోద్వేగంతో చెప్పారు. స్టెమీ విధానాన్ని పటిష్ఠంగా అమలుచేస్తున్నందున గుండెపోటుకు గురైన వారిలో 3వేల మందికిపైగా ప్రాణాలను నిలబెట్టినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. **డీఎన్బీ కోర్సుల్లో ప్రవేశాలకు సానుకూలం!** ఎంబీబీఎస్ వైద్యులకు ఇన్-సర్వీసు కోటా కింద డీఎన్బీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. ప్రస్తుత సీట్ల భర్తీ విధానం, ఇతర అంశాలపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ మాట్లాడుతూ వైద్యులకు వృత్తిపరమైన శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామని వెల్లడించారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ జబ్బులు ముదరకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో పీహెచ్సి వైద్యుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రాథమిక వైద్యుల సంఘం ముఖ్య ప్రతినిధులు రవీంద్రనాయక్, వినోద్, కిషోర్, రాహుల్ మాట్లాడుతూ పీహెచ్సీల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని, డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులను తనిఖీలకు పంపించాలని, ఆర్థిక పరమైన డిమాండ్లు పరిష్కరించాలని, నైటుషిఫ్టుల్లో ఉన్న వారికి భద్రత కల్పించాలని, వాచమెన్ ను నియమించాలని కోరారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188